వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా ప్రణవ్ గోపాల్ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర పాలక సంస్థ (వీఎంఆర్‌డీఏ) చైర్మన్‌గా ప్రణవ్ గోపాల్ శుక్రవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కొద్దిసేపు ఛాంబర్‌లో ఉండి వెళ్లిపోయారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసినందున జిల్లా ఎమ్మెల్యేలంతా నగరానికి వచ్చిన తరువాత సోమవారం అందరి సమక్షంలో పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకుంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

సంక్షేమ హాస్టళ్ల ప్రక్షాళన

వంద రోజుల ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశం



హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థితో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు

- మౌలిక సదుపాయాల కల్పన, భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు
- విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా పర్యవేక్షణ
- ట్యూటర్ల నియామకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గడిచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన సంక్షేమ వసతి గృహాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. వసతి గృహాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు సూచించింది. ఇందుకోసం వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేయాలని, అనంతరం ఫలితాలు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సంక్షేమ శాఖ అధికారులు వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు మెరుగైన విద్యా బోధన, నాణ్యమైన ఆహారాన్ని అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టళ్లలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు ఎప్పుడు బయటకు వెళుతున్నారో, ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి. దీనివల్ల అనేక ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసిస్టెంట్ సోషల్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు

ఎప్పటికప్పుడు అధికారుల తనిఖీలు

ఎప్పటికప్పుడు హాస్టళ్లను తనిఖీ చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లా ఆఫీసర్లు ప్రతి నెలా పది హాస్టళ్లను తనిఖీ చేయాలి. హాస్టళ్ల పరిసరాల్లో శానిటేషన్ సమస్య ఉంటే స్థానిక పంచాయతీలు, మునిసిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిశుభ్రంగా ఉండేలా చేయాలి. అలాగే విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలి. ఈ మేరకు కలెక్టర్ సదరు ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతి నెలా హాస్టల్స్‌లో మెడికల్ క్యాంపులను నిర్వహించేలా చూడాలి. విశాఖ విద్యా వసతి వికాసం ప్రోగ్రామ్‌లో భాగంగా నాలుగు కోట్ల రూపాయలతో 12 హాస్టళ్ల భవనాలను మరమ్మతు చేయిస్తున్నారు. వీటితోపాటు ఇతరత్రా ఏమైనా ఉంటే వంద రోజుల్లో పూర్తిచేయాలి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్ల అధికారులు కూడా ప్రతిపాదనలు పెట్టాలి. ముఖ్యంగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు, స్పోర్ట్స్ కిట్స్ సమకూర్చుకోవడం చేయాలి.

బాలికల రక్షణపై దృష్టి

బాలికల వసతి గృహాల పరిసరాల్లో ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ... మిగతా 6వ పేజీలో



నితీశ్‌కుమార్‌రెడ్డి

శభాష్ నితీశ్

- ఆస్ట్రేలియా గడ్డపై సత్తాచాటాడు
- తొలి టెస్టులోనే 41 పరుగులు చేసి జట్టును ఆదుకున్న నగర యువకుడు
- టీమిండియా బ్యాటింగ్‌లో నితీశ్‌దే అత్యధిక వ్యక్తిగత స్కోరు

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా గడ్డపై విశాఖ యువ క్రికెటర్ నితీశ్‌కుమార్ రెడ్డి సత్తా చాటాడు. పెర్త్ పిచ్‌పై అలవోకగా బౌండరీలు బాది ఆస్ట్రేలియా బౌలర్లను బెంబేలెత్తించాడు. ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న భారత్ జట్టుకు నగరానికి చెందిన నితీశ్‌కుమారెడ్డి ఎంపికైన విషయం తెలిసిందే. పెర్త్‌లో శుక్రవారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో తుది జట్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్నాడు. టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని నితీశ్‌కుమార్‌రెడ్డి వమ్ము చేయకుండా సొగసైన బ్యాటింగ్‌తో రాణించి జట్టును ఆదుకున్నాడు. వరుసగా వికెట్లు నేలకొరుతున్న సమయంలో ఎనిమిదో నంబరు బ్యాట్స్‌మన్‌గా వికెట్ల ముందుకు వచ్చిన నితీశ్‌కుమార్‌రెడ్డి కెరీర్‌లో ఆడుతున్నది తొలి టెస్ట్ అయినా వంద టెస్టులు ఆడిన అనుభవజ్ఞుడిలా ఒత్తిడికి గురికాకుండా ఆస్ట్రేలియా బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొని పరుగులు సాధించాడు. ఎటువంటి తడబాటు లేకుండా బంతులను బౌండరీ లైను దాటించి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. సహ బ్యాటర్లు ఒక్కొక్కరుగా పెవెలియన్‌కు చేరుతున్నా ఆత్మవిశ్వాసంతో ఒంటరి పోరాటం చేశాడు. కేవలం 59 బంతుల్లో ఆరు బౌండరీలు, ... మిగతా 6వ పేజీలో

ఏయూ మాజీ వీసీపై విచారణ

వారం రోజుల్లో కమిటీ ఏర్పాటుచేస్తాం

- జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి నారా లోకేశ్ హామీ
- ప్రసాదరెడ్డి హయాంలో జరిగిన అక్రమాలను పూసగుచ్చినట్టు వివరించిన ప్రజా ప్రతినిధులు
- ఇంకా ఆయన కనుసన్నల్లోనే పాలన సాగుతుందని ఫిర్యాదు
- ప్రస్తుత పాలనా వ్యవహారాలపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందుతుందన్న అమాత్యుడు



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ పి.గణబాబు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఉన్నారు

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి హయాంలో జరిగిన అక్రమాలపై వారం రోజుల్లో విచారణ కమిటీ వేస్తామని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ప్రభుత్వ విప్ పి.గణబాబు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌లు శుక్రవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు ప్రసాదరెడ్డి హయాంలో జరిగిన అక్రమాలను పూసగుచ్చినట్టు వివరించడంతోపాటు ఇంకా మాజీ వీసీ కనుసన్నల్లోనే పాలన కొనసాగుతుందని ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన లోకేశ్...గత వీసీ హయాంలో జరిగిన అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. ఏయూలో ప్రస్తుత పాలనా వ్యవహారాలపై ఎప్పటికప్పుడు తనకు, తన పేషీకి సమాచారం అందుతుందన్నారు. వర్సిటీ పాలనలో రాజకీయ జోక్యం లేకుండా చేయాలన్నదే తన అభిమతమన్నారు. టీడీపీ సానుభూతి పరులు కూడా వర్సిటీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని మంత్రి సూచించారు. పూర్తిస్థాయి ఉపకులపతి నియామకం కోసం సెర్చ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి కల్పనకు సంబంధించిన కోర్సులు నిర్వహించి విద్యార్థులకు మేలు చేసేలా ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. అనుబంధ కళాశాలలను బలోపేతం చేస్తామని, ఉన్నత విద్య అభివృద్ధికి నిరంతర పర్యవేక్షణ చేస్తానని లోకేశ్ అన్నారు.

సింహాచలం భూ సమస్య పరిష్కరించండి

- దేవస్థానానికి ప్రత్యామ్నాయ భూములు త్వరగా బదిలీ అయ్యేలా చూడాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు
- 12,419 కట్టడాలను క్రమబద్ధీకరిస్తామని మంత్రి హామీ

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూ సమస్యను ఎన్నికల హామీగా మిగిలిపోకుండా చూడాలని ... మిగతా 6వ పేజీలో

29న ప్రధాని రాక

- అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు జాతికి అంకితం
- ఏయూ గ్రౌండ్స్ లేదా అనకాపల్లిలో బహిరంగ సభ



విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 29వ తేదీన నగరానికి రానున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ రూ.85 వేల కోట్లతో నెలకొల్పనున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు ఆయన శంకుస్థాపన చేస్తారు. అలాగే హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో లేదా అనకాపల్లి జిల్లాలో బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనున్నారు. ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లకు విశాఖపట్నం జిల్లా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. శుక్రవారం అధికారులతో కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ సమావేశం నిర్వహించి ఏర్పాట్లు సమీక్షించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా పర్యటన వివరాలు వచ్చిన తరువాత బయటకు వెల్లడించనున్నారు.

గాజువాకలో డయేరియా



స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.పద్మావతిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

- మంచినీరు కలుషితం కావడంతో ముగ్గురు ఆస్పత్రిపాలు
- కార్యనిర్వాహక ఇంజనీర్‌కు షోకాజ్ నోటీసు
- వార్డు ఎమినీటిస్ సెక్రటరీ సస్పెన్షన్

గాజువాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 67వ వార్డు పరిధిలోని సాయినగర్‌లో మంచినీరు కలుషితం కావడంతో పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. కొంతమంది కోలుకున్నారు. ముగ్గురు మాత్రం డయేరియా బారినపడ్డారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వార్డులో రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంచినీటి పైప్‌లైను కాలువలో పడిపోయింది. ఆ పైపు ద్వారా సరఫరా అయిన నీరు తాగిన వారిలో కొంతమంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ముగ్గురు డయేరియా బారినపడ్డారు. బి.త్రివేణి, పి.పద్మావతి అనేవారు గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, రమేష్ అనే వ్యక్తి పీహెచ్‌సీలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. బాధితులను డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పరామర్శించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్.వెంకటరావుకు షోకాజు నోటీసు ఇవ్వాలని, వార్డు ఎమినిటీ సెక్రటరీ బొడ్డేటి నవీన లక్ష్మిని సస్పెండ్ చేయాలని జోనల్ కమిషనర్‌ను జీవీఎంసీ కమిషనర్ ఆదేశించారు. తాగునీటి పైపులైన్లను తక్షణమే మరమ్మతు చేయించాలని ఆదేశించారు.

గండి బాబ్జీ బాధ్యతలు స్వీకరణ



ఆంధ్రప్రదేశ్ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సంస్థ (ఏపీ ఆయిల్ ఫెడ్) పర్సన్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పెందుర్తి నియోజక వర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ శుక్రవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, పలువురు కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు హాజరై ఆయనను అభినందించారు. - సబ్బవరం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):



పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ప్రమోషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అన్నివిధాలుగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలు స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో సూచనలు చేయాలన్నారు. జిల్లాలో ఎస్ఎంఎంఈలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో పారిశ్రామికవేత్తలంతా అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం వి.ఆదిశేషు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

విశాఖ-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- విశాఖ-1 ఇన్‌స్పెక్టర్‌కు అదనపు బాధ్యతలు - 6లో

కల్తీపై కొరడా

కల్తీ పాలు విక్రయించినందుకు శ్రీ విజయ విశాఖ డెయిరీకి రూ.2 లక్షలు జరిమానా

- పెరుగు కల్తీ చేసిన పంజాబ్ దాబాకు రూ.20 వేలు, కల్తీ బెల్లం విక్రయిస్తున్న గున్నరాజు ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.20 వేలు చొప్పున జరిమానా
- పెసర పప్పు కల్తీ చేసిన షాపు యజమానికి రూ.15 వేలు, నాణ్యత లేని బ్రెడ్ అమ్ముతున్నందుకు బెంగుళూరు అయ్యంగార్ బేకరీకి రూ.ఐదు వేలు జరిమానా
- అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు



జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పలు వ్యాపార సంస్థలపై జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ కోర్టు కొరడా ఝుళిపించింది. గత కొంతకాలంగా ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సేకరించిన నమూనాలను పరీక్షలకు పంపారు. ఆ ఫలితాలు తాజాగా వచ్చాయి. కొన్ని దుకాణాలు/స్టోర్స్‌లో కల్తీ జరిగినట్టు తేలడంతో కేసులు నమోదుచేశారు. ఇవి శుక్రవారం జాయింట్ కలెక్టర్/అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణకు వచ్చాయి. ఏడు కేసులకు సంబంధించి కల్తీ నిర్ధారణ కావడంతో జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ తీర్పును వెలువరించారు. మొత్తం ఏడు వ్యాపార సంస్థలకు రూ.2,80,000 జరిమానా విధించారు.

గాజువాకలోని శ్రీవిజయ విశాఖ పార్లర్‌లో విక్రయిస్తున్న టోన్డ్ మిల్క్‌లో కల్తీ జరిగినట్టు తేలడంతో ఆ సంస్థ (శ్రీవిజయ విశాఖ డెయిరీ)కు రెండు లక్షల రూపాయలు జరిమానా విధించారు. అలాగే, కాకానినగర్‌లోని పంజాబీ దాబాలో పెరుగు కల్తీ జరగడంతో రూ.20 వేలు, గోపాలపట్నంలోని గున్నరాజు ఎంటర్‌ప్రైజెస్‌లో కల్తీ బెల్లాన్ని విక్రయిస్తున్నట్టు నిర్ధారణ కావడంతో రూ.20 వేలు జరిమానా విధించారు. అలాగే, ప్రహ్లాదపురంలోని టేస్టీ మసాలా స్టోర్‌లో పెసరపప్పు కల్తీ చేసినట్టు తేలడంతో రూ.15 వేలు జరిమానా వేశారు. పెదగంట్యాడలోని సుప్రజ ఫుడ్స్‌లో కలుషితమైన నీటిని ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు తేలడంతో రూ.10 వేలు, మధురవాడలోని గోపాలకృష్ణ ప్రొడక్ట్స్‌లో టమాటా సాస్‌లో కల్తీ జరిగినట్టు తేలడంతో రూ.10 వేలు జరిమానా విధించారు. అలాగే పెందుర్తిలోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలో బ్రెడ్ కల్తీ అయినట్టు తేలడంతో షాపు యజమానికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ తీర్పును ... మిగతా 6వ పేజీలో

11 పాఠశాలల పనివేళలు పెంపు



విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలను స్వల్పంగా పెంచాలన్న ఆదేశాలను విశాఖ జిల్లాలోని 11 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ నడుస్తున్నాయి. అయితే జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలు ఈనెల 21వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహించనున్నారు. గిడిజాల, అడవివరం, అగనంపూడి, రెడ్డిపల్లి, నడుపూరు, వేపగుంట, భీమిలి రెండో వార్డులో గల జడ్పీ ఉన్నత పాఠశాలలు, జీవీఎంసీ పరిధిలోని మల్కాపురం, ప్రకాశరావుపేట, మాధవధార, చినవాల్తేరులోని కేడీపీఎం ఉన్నత పాఠశాలల సమయం పెంపుదల చేశారు. పనివేళల పెంపుపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. నెలాఖరు తరువాత ప్రభుత్వం నిర్ణయం మేరకు పాఠశాలల పనివేళలు ఉంటాయన్నారు.

నేడు అనంత పద్మనాభుని దీపోత్సవంపై సమీక్ష

పద్మనాభం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ఈనెల 30న జరగనున్న అనంత పద్మనాభస్వామి దీపోత్సవం నిర్వహణపై శనివారం ఉదయం స్థానిక కల్యాణ మండపంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో నానాజీబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు చెప్పారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలో వివాదం

పద్మనాభం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి జరిగిన శంకుస్థాపనలో శుక్రవారం వివాదం నెలకొంది.జనసేన నాయకులు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఉపక్రమించగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు, టీడీపీ నాయకుడు రొంగళి అప్పల సూర్యనారాయణ అడ్డుకున్నారు. ఈ రహదారి పనులను గత టీడీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టామని, ఆ బిల్లులు ఇంకా ఇవ్వలేదని, శంకుస్థాపన నిలుపుదల చేయాలని జనసేన నాయకులను కోరారు. కానీ వారు పట్టించుకోకుండా శంకుస్థాపన చేసి, వెళ్లిపోయారు. ఈ విషయమై గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ రోడ్డు పనులను తమ గ్రామంలో ఉన్న కార్యకర్తలకు కాకుండా గొల్లలపాలెం గ్రామానికి చెందిన వ్యక్తికి అప్పగించారని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే గంటాకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

సభ్యత్వాల నమోదుతో టీడీపీలో జోష్

పద్మనాభం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వాల నమోదుతో నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్తేజం కనిపిస్తోందని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన అనంతవరం గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పార్టీలో ఎక్కువగా చేరుతున్నారని చెప్పారు. సభ్యత్వం పొందిన వారికి అధిష్ఠానం ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి పెద ఎర్రినాయుడు, నాయకులు ఎస్. వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆర్. అప్పల సూర్యనారాయణ, వార్డు సభ్యులు ఎస్. రమణమ్మ, అప్పారావు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్దగెడ్డ వద్ద టీడీపీ నాయకులు సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, శ్రీనివాసరెడ్డి, సింహాచలం, ఈశ్వరరావు, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ప్రత్యేక దంత వైద్య కేంద్రం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గీతాంజలి

సాగర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు అతి తక్కువ ఖర్చుతో అధునాతన పరికరాలతో దంత వైద్యం చేయనున్నట్టు జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ గీతాంజలి తెలిపారు. శుక్రవారం ఆమె ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక కేంద్రంలో దంత వైద్యంతో పాటు పొగాకు తదితర ఉత్పత్తుల వాడకం ద్వారా ఎదురయ్యే నోటి ఆరోగ్య సమస్యలకు సంబంధించి కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నరసింహారావు, దంత విభాగం అధిపతి డాక్టర్ మనీష్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్ నాగజన ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ

భీమునిపట్నం,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కళా సాహితీ సంస్థ వ్యవస్థాపక సభ్యుడు స్వర్గీయ కాళ్ల నారాయణరావు జ్ఞాపకార్థం ఆయన తనయుడు కాళ్ల సన్నీ మైక్ సెట్ వితరణంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వర్మ,సభ్యులు కిశోర్, రమణ ప్రసాద్, డాక్టర్ లావణ్య, పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమణ

- రాత్రికి రాత్రి వెలుస్తున్న దుకాణాలు
- ఇబ్బందుల్లో పాదచారులు



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

మధురవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడాకాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి.పాదచారులు కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపారులకు వరంగా మారుతున్నాయి. కొందరు ఏకంగా ఫుట్‌పాత్ మధ్యనే దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో నడవడానికి స్థలం ఉండడం లేదు. దీంతో పాదచారులు రహదారిపై నడిచి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళ కొందరు దుకాణాలకు కావాల్సిన సామగ్రిని తరలించి తెల్లవారేసరికి బడ్డీ సిద్ధం చేస్తున్నారు.వీటికి జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోవడం లేదు. ఒక్కోసారి స్థలాల విషయమై దుకాణదారుల మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

భీమిలిలో ఘనంగా సత్యసాయి పల్లకీ సేవ

భీమునిపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల్లో భాగంగా పట్టణంలోని భక్తులు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మొల్లి సూర్య సన్యాసిరావు ఆధ్వర్యంలో సాయంత్రం బాల వికాస్ దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా చిన్నారులతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం భక్తులు బాబా చిత్రపటంతో పట్టణ పురవీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. బాబా గీతాలతో, భక్తుల భజనలతో, చిన్నారులు, మహిళల కోలాటాలతో పల్లకీ సేవ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సత్యసాయి మందిరం నాయకులు సూర్యనారాయణ, భాస్కరరావు, లొడగల రామకృష్ణ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంటా నూకరాజు

కొనసాగుతున్న మత్స్యకారుల రిలే దీక్షలు

భీమునిపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు హెచ్చరించారు. జోనల్ కార్యాలయం ఎదుట జిల్లా మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకుల నుంచి వినియోగంలో ఉన్న శ్మశానవాటికలను ఆక్రమించి రెస్టారెంట్ నిర్వాహకులు నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తమ సమస్యలను అధికారులు చులకనగా చూస్తున్నారని, తమ తడాఖా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. న్యాయం జరిగే వరకూ దీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, నాయకులు వాసుపల్లి గరగయ్య, కారి చిన్నారావు, దాసు, పీరుపల్లి రమేశ్, బర్రి కొండబాబు, పీరుపల్లి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా
- పోలీసుల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

సాగర్‌నగర్,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పనిఒత్తిడితో ఉండే పోలీసులకు క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. కైలాసగిరి పోలీస్ పెరేడ్ మైదానంలో అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు ఏడాదంతా మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ విధులు నిర్వర్తిస్తుంటారని, వారికి క్రీడా పోటీల నిర్వహణ వల్ల మానసిక ఒత్తిడి దూరమై ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. సిబ్బంది క్రీడాస్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని సూచించారు. కాగా రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, టగ్‌వార్, షటిల్ బ్యాడ్మింటన్, తదితర క్రీడలు నిర్వహిస్తున్నారు. ముందుగా అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్స్, ఆర్మ్ రిజర్వ్ పోలీసు అధికారులు, సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. సిబ్బందిలో ఉత్సాహం నింపేందుకు ఎస్పీ కూడా స్వయంగా కొన్ని క్రీడలు ఆడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం. దేవప్రసాద్, ఎల్. మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం. శ్రావణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ మోహన్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'హైందవ శంఖారావం విజయవంతం చేయండి'

భీమునిపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభకు హిందువులు అధిక సంఖ్యలో తరలిరావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. శుక్రవారం వారు బీచ్‌రోడ్‌లో ఉన్న అయ్యప్ప ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న మహా నారాయణ సేవను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తం చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ చట్ట సవరణ చేయాలని ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. దేవాలయాలు, దేవదాయ, ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో హిందువులు మాత్రమే ఉండాలని, ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కనకల సన్యాసినాయుడు, సభ్యులు సుసరాపు కామేశ్వర మాధవశాస్త్రి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తారక్ రూపాకుల రవికుమార్, పప్పు భరద్వాజ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు, భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె. ఎర్రునాయుడు, మొకర నరసింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం : ఆర్‌జేడీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు గ్రంథ పఠనం పట్ల ఆసక్తి చూపాలని విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ చెప్పారు. అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఇమంది పైడిరాజు చొరవతో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సాధారణ పాఠ్యాంశాలతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ, చారిత్రక పుస్తకాలను చదవడం వల్ల మంచి విజ్ఞానం సంపాదించుకోవచ్చునన్నారు.

విద్యుత్ లైటింగ్‌తో ఆకర్షణీయంగా ఫౌంటెన్

భీమునిపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్‌లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫౌంటెన్ విద్యుత్ దీపాలతో సుందరంగా కనిపిస్తోంది. 2004లో మునిసిపాలిటీగా ఉన్నప్పుడు ఈఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అధికారులు ఇటీవల దీనికి మరమ్మతులు చేసి, రంగు వేసి, విద్యుత్ లైటింగ్ అమర్చారు. బీచ్‌కు వచ్చే సందర్శకులను ఈ కలర్ ఫుల్ ఫౌంటెన్ అమితంగా ఆకట్టుకుంటోంది.



విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న ఫౌంటెన్

ఇళ్ల మరమ్మతుల అనుమతికి ఎదురుచూపు

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ బాధితులు ఇళ్ల మరమ్మతుల అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లల్లో నాలుగు ప్రభుత్వాలు మారినా.. సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నికల వేళ నాయకులు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. 2023లో వైసీపీ ప్రభుత్వం బాధితుల ఇళ్ల మరమ్మతుకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. దాని ఆధారంగా కొందరు దేవస్థానం అందజేసిన ప్రత్యేక దరఖాస్తు నింపి అనుమతులు పొందారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అదే జీవోను కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇది జరిగి సుమారు నెల రోజులు కావస్తున్నా.. అధికారులు అమలు చేయలేదు. దేవస్థానం అధికారులు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లను పరిశీలించి, అనుమతి ఇవ్వాల్సి ఉంది. అందుకు ప్రత్యేక కమిటీని నియమించాల్సి ఉందని సమాచారం. కమిటీ ఏర్పాటు కాకపోవడం, భూపరిరక్షణ విభాగం దరఖాస్తుల జారీ ప్రక్రియను నేటివరకు ప్రారంభించకపోవడంతో బాధితులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ర్యాలీ

మధురవాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పేదలందరికీ ప్రభుత్వం రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏడో వార్డు పరిధిలోని మల్లయ్యపాలెంలో ఇళ్ల స్థలాల కోసం స్థానికులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం 60వ నంబరు సచివాలయం సంక్షేమ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షయపాత్ర వంట శాల సందర్శన

ఆనందపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం ఐఐఎం రోడ్డులో ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ వంటశాలను జాగృతి యాత్ర సభ్యులు శుక్రవారం సందర్శించారు. జాగృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండే కాకుండా 16 దేశాల నుంచి పారిశ్రామిక రంగంలో ఆసక్తి కలిగిన 525 మంది యువత జాగృతి యాత్రలో పాల్గొన్నారు. ఈనెల 16న ముంబాయిలో ప్రారంభమైన ఈ యాత్ర శుక్రవారం విశాఖకు చేరుకుని, అక్షయపాత్ర వంటశాలను సందర్శించారు. అక్షయపాత్ర ఆధ్వర్యంలో 25 వేల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న విధానాన్ని అధ్యయనం చేశారు. వంట శాలలో అధునాతన యంత్రాలతో భోజనం తయారీ, వాహనాల్లో పాఠశాలలకు తరలించడం వంటి అంశాలను పరిశీలించడంతో పాటు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌరచంద్ర దాస, ఫౌండేషన్ విశాఖపట్నం అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, సభ్యులు యు. విశ్వాస్, అంబరీషదాస, దల్వీర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై త్రుటిలో తప్పిన ప్రమాదం



డివైడర్‌పై పడిన గ్రానైట్ దిమ్మలు, పక్కన ప్రమాద దృశ్యం

సాగర్‌నగర్/కొమ్మాది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గ్రానైట్ రాళ్లతో మధురవాడ నుంచి నగరం వైపు వస్తున్న ట్రాలీ మహిళా పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చే సరికి ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి డివైడర్ దాటి అవతలి రోడ్డులోకి దూసుకుపోయింది. ఆ సమయంలో నగరం నుంచి మధురవాడ వైపు బొగ్గు లోడుతో వెళుతున్న లారీని ఢీకొనడంతో ట్రాలీపై ఉన్న రెండు గ్రానైట్ దిమ్మలు డివైడర్ మధ్యలో పడ్డాయి. ఈప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన తెల్లవారుజామున జరగడంతో పెద్దగా వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

రుషికొండలో నేటి నుంచి గిరిజన సంత

సాగర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం) భవనం ఆవరణలో శనివారం నుంచి గిరిజన సంత నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఈడీ డాక్టర్ రాణి మందా తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా ఈనెల 23 నుంచి 26 వరకు సంతలో గిరిజన ఉత్పత్తులు లభించనున్నట్టు చెప్పారు.

కాకినాడ ఎంపీ దృష్టికి పంచ గ్రామాల భూ సమస్య

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్యను సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నేతలు కాకినాడ ఎంపీ టి. ఉదయ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు శుక్రవారం వారు ఎంపీని కాకినాడలో కలిసి వినతి పత్రం అందించారు. సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

విశాఖ-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.చిన్నారావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ చంద్రశేఖరవర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణ పూర్తయ్యేంత వరకు విశాఖపట్నం వదిలి వెళ్లకూడదని ఆదేశించారు. చిన్నారావు ప్రస్తుతం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు ఆయన సస్పెండ్ కావడంతో ఆ బాధ్యతలను విశాఖపట్నం-1 ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు అప్పగించారు. ఇప్పటికే తగిన వనరులు లేక అన్ని పరిశ్రమలను సకాలంలో తనిఖీ చేయలేకపోతున్నామని అధికార వర్గాలు వాపోతున్నారు. ఇటువంటి సమయంలో ఏకంగా రెండు జిల్లాల బాధ్యతలను ఇంకో అధికారికి అప్పగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అనకాపల్లి జిల్లాలో అత్యధిక సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. అక్కడే నిత్యం ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ఒక్కరిపైనే భారం మోపకుండా వేరొక అధికారిని ప్రత్యేకంగా నియమించాల్సిన అవసరం ఉంది.సకాలంలో తనిఖీలు నిర్వహించకపోతే ప్రమాదాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ఇదిలావుండగా పి.చిన్నారావు సస్పెన్షన్‌కు గల కారణాలేమిటో సంబంధిత శాఖ అధికారులు బయటకు వెల్లడించడం లేదు.

'పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు పరం చేయొద్దు'



నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేటు పరం చేసే యోచన విరమించుకోవాలని పోర్టు వీడీఎల్‌బీ, డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు శుక్రవారానికి 53వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్స్ తెరిచే తేదీ వాయిదా వేశారన్నారు. వాటిని పూర్తిగా రద్దుచేయాలన్నారు. దశాబ్దాలుగా వేలాది మందికి సేవలందిస్తున్న పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, ఎంవీ రాఘవులు, పి.శంకరరావు, సీహెచ్ త్రినాథరావు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

బాధ్యత ఉంది. నగర పోలీస్ కమిషనర్‌కు బాలికల వసతి గృహాలకు సంబంధించిన జాబితాను అధికారులు అందించారు. రాత్రివేళల్లో ఆయా పరిసరాల్లో పెట్రోలింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. మెనూ పక్కాగా అమలు చేయాలి. మెనూ అమలును ఉన్నతాధికారులను పర్యవేక్షించాలి.

మెరుగైన ఫలితాలు

హాస్టళ్లలో ఉండే విద్యార్థుల చదువుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. మెరుగైన ఫలితాలను సాధించేలా ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షల ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. ఇంటర్, డిగ్రీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యాన్ని ప్రణాళికలో చేర్చారు. ఇందుకోసం ట్యూటర్స్‌ను నియమించుకోవాలి. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలి. గ్రేడ్లు కేటాయించాలి. క్విజ్ పోటీలు నిర్వహించాలి. మోటివేషనల్ క్లాసులను నిర్వహించాలి. వార్డెన్స్ స్కూల్ టీచర్లతో మాట్లాడి విద్యార్థులను చదువులో మరింత మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలను సిద్ధంచేయాలి. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి. వీటితోపాటు అడ్మిషన్లు పూర్తిగా అయ్యేలా చూడడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించి చదువులో రాణించేలా చూడడం, క్రీడా పోటీలు నిర్వహించడం వంటివి చేయాలి.

యాక్షన్ ప్లాన్ అమలుకు స్పష్టమైన ఆదేశాలు

- కె.రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

గత నెలాఖరు నుంచి వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా షెడ్యూల్‌ను తయారుచేశాం. ఇప్పటికే హాస్టల్ వార్డెన్స్‌కు షెడ్యూల్‌ను అందించి అమలుకు ఆదేశించాం. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతోపాటు చదువులో రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. మెనూ అమలు, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అంశాలపై దృష్టిసారించాం. ట్యూటర్లు నియామకం, మోటివేషనల్ క్లాస్‌ల నిర్వహణకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నాం.

సింహాచలం భూ సమస్య పరిష్కరించండి

... 5వ పేజీ తరువాయి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామనే విశ్వాసంతోనే ప్రజలు భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. దేవదాయ శాఖ అధికారులు అంశం కోర్టు పరిధిలో ఉందని అస్పష్టమైన సమాధానం చెప్పి తప్పించుకోవడం సరికాదన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ఇళ్లు కోల్పోయిన బాధితులు వారి కట్టడాల వెనుక ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను కలుపుకొని నిర్మాణం చేపట్టుకోవడానికి దేవస్థానం, జీవీఎంసీల నుంచి అభ్యంతరం లేకుండా చూడాలని కోరారు. దేవస్థానం క్రమబద్ధీకరించబోయే 12,419 కట్టడాలకు ప్రత్యామ్నాయంగా ఇవ్వబోయే ప్రభుత్వ భూముల బదలాయింపు త్వరగా పూర్తిచేయాలని గంటా కోరారు.

సమాన విలువైన భూములే ఇస్తున్నారు

- వెలగపూడి రామకృష్ణబాబు, తూర్పు ఎమ్మెల్యే

ప్రజలు గృహాలు నిర్మించుకున్న దేవస్థానం భూముల విలువ లెక్కించి ఆ విలువకు సమానమైన భూములు (రూ.5,377 కోట్లు) ప్రత్యామ్నాయంగా ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదించిందని, అయితే ఈ ప్రక్రియ వేగవంతంగా జరగడం లేదని రామకృష్ణబాబు అన్నారు. టీడీపీ 2014లో గెలిచినప్పుడు విశాఖలో నిర్వహించిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే దీనిపై తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, త్వరగా భూముల బదలాయింపు పూర్తిచేసి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

ధర్మకర్తలతో మాట్లాడతాం

- ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ మంత్రి

ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలపై దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. రూ.5,377 కోట్ల విలువైన భూములు దేవస్థానానికి ఇస్తున్నట్టు హైకోర్టుకు తెలియజేసి, 12,419 కట్టడాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ఈ పంచ గ్రామాల సమస్యపై విశాఖలో ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. ఖాళీ స్థలాలకు గతంలోనే ధరలు నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలతోనే మాట్లాడతామని హామీ ఇచ్చారు.

కల్తీపై కొరడా

... 5వ పేజీ తరువాయి

వెలువరించారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, శుక్రవారం విచారణ పూర్తికావడంతో అడిషనల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు తెలిపారు. కల్తీ చేస్తున్నట్టు అనుమానం ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. కల్తీ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

శభాష్ నితీష్

... 5వ పేజీ తరువాయి

ఒక సిక్సర్‌తో 41 పరుగులు చేసి..చివరి వికెట్‌గా పెవెలియన్‌కు చేరాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకు ఆలౌట్ కాగా అందులో నితీశ్‌కుమార్‌రెడ్డి చేసిన 41 పరుగులే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈఏడాది జరిగిన ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన నితీష్‌కుమార్‌రెడ్డి..అద్భుతంగా రాణించి టీమిండియా సెలక్టర్లను ఆకట్టుకున్నాడు. దీంతో స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. సిరీస్‌లో ఢిల్లీలో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారీ హాఫ్ సెంచరీతో (74; 4 బౌండరీలు, 7 సిక్సర్లు) సత్తా నిరూపించుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించి భారత్ జట్టులో చోటుదక్కించుకోవడమే కాకుండా తొలి టెస్టులోనే తన ప్రతిభను నిరూపించుకున్నాడు.

ప్లాంటు పరిరక్షణ కోరుతూ ర్యాలీ, బహిరంగ సభ రేపు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ డిమాండ్ చేస్తూ ఈ నెల 24న గాజువాకలో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ప్లాంట్‌లో అఖిలపక్ష నాయకులు ఆవిష్కరించి మాట్లాడుతూ ప్లాంట్‌లో పరిస్థితి రోజురోజుకూ దిగజారుగతోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఇంత జరుగుతున్న ప్రజా ప్రతినిధులు స్పందించటం లేదని ఆరోపించారు. ప్రధానమంత్రి ఈ నెల 29న విశాఖ రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించమని, సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.



న్యాయవాదుల నిరసన

నగరంలో న్యాయ కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కోర్టు గేటు వద్ద న్యాయవాదులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు కఠిన తీసుకోవాలని కోరారు.

- డాబాగార్డెన్స్, ఆంధ్రజ్యోతి

☛ సంక్షిప్తంగా..

24న బాలబాలికలకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 24 బాలబాలికలకు ఉచితంగా నృత్యం, చిత్రలేఖనం, సంగీత విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో ఆదివారం ఉదయం 10 నుంచి 12 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు వినియోగించుకోవాలని కోరారు.

ఉక్కు ఉద్యోగుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వేతనాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని సీఐటీయూ గౌరవధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం వద్ద నగదు నిల్వలు ఉన్నప్పటికీ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



తిరువీధిలో అమ్మవార్లకు పూజలు

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సాయంత్రం చతుర్భుజి తాయరు, సింహవల్లీ తాయార్ అమ్మవార్ల తిరువీధి ఉత్సవంవైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిలో ఉంచి ఆలయవిద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. మార్గం పొడవునా అష్టదిక్పాలకులకు పూజలు చేసి ప్రత్యేక ఫలాల నివేదనలు చేశారు.

180 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కురపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు జరిపారు. మందులను ఉచితంగా అందజేశారు.

భీమిలి ఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మెడికవర్ వైద్యులు జయసాయి చంద్, రాజు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో క్యాంప్ సమన్వయ అధికారి రవికిరణ్, కర్రోతు దుర్గరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 36, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 34, క్యారెట్ 70 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 46, కీరదోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

చిట్టడవులా! ఫుట్‌పాత్‌లా!!

- 13వ వార్డు ఫుట్‌పాత్‌లపై దట్టంగా పెరిగిన తుప్పలు
- ఏళ్ల తరబడి జంగిల్ క్లియరెన్స్ చేపట్టని అధికారులు
- వాకర్స్‌కు తప్పని ఇబ్బందులు



కృష్ణాపురం నుంచి పైనాపిల్ కాలనీ వైపు వెళ్లే ఫుట్‌పాత్‌పై పెరిగిన పొదలు

ఆరిలోవ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల శ్రీకృష్ణాపురం నుంచి పైనాపిల్ కాలనీ వైపు వెళ్లే సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లు పొదలతో నిండిపోయాయి. గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడంతో కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లు కనిపించని పరిస్థితి నెలకొని ఉంది. దీంతో పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పోతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు కావడంతో ఈ మార్గం విశాలంగా ఉంటుంది. దీంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనాలు, స్థానికులు వివిధ వెహికల్స్‌పై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ సర్వీసు రోడ్డులో ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేస్తుంటారు. వీరిలో ఎక్కువ శాతం వృద్ధులు, మహిళలు ఉంటారు. ఆరోగ్య పరిరక్షణ భాగంగా వీరు వాకింగ్ చేస్తూ ఉంటారు. కొందరు డ్రైవింగ్ నేర్చుకోవడానికి కూడా ఇక్కడకే వస్తుంటారు. వీరంతా సర్వీసు రోడ్డులోనే వినియోగిస్తుంటారు. అయితే ఇక్కడ ఉన్న ఫుట్‌పాత్‌లపై దట్టంగా తుప్పలు పెరిగిపోవడంతో వాకింగ్ చేసే వారికి, పాదచారులకు ఇబ్బందిగా మారింది. వీరంతా ప్రత్యామ్నాయం లేకపోవడంతో సర్వీసు రోడ్డునే వినియోగిస్తుంటారు. దీంతో ఎప్పుడే ఏ వాహనం ఢీకొంటుందోనన్న భయం వీరిలో వెన్నాడుతుంటుంది. తుప్పలు పెరిగిపోవడంతో వాకింగ్‌కు వచ్చే మహిళలు చైన్ స్నాచింగ్‌లు జరుగుతాయో ఏమోనని ఆందోళన చెందుతుంటారు. ఫుట్‌పాత్‌లపై తుప్పలు దట్టంగా పెరగడంతో విష ప్రాణుల భయం కూడా ఉంది. దీంతో ఎవరూ ఫుట్‌పాత్‌లపై నడిచే సాహసం చేయడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లపై జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదని, దీంతో కొన్ని చోట్ల చిట్టడవిలా కనిపిస్తుంటుదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనాజీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే ఫుట్‌పాత్‌లపై తుప్పలను తొలగించాలని కోరుతున్నారు.



కొత్త గోశాల నుంచి శ్రీకృష్ణాపురం వైపు వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్



పదో సెక్టరులో రోడ్డు పక్కన పడేసిన విద్యుత్తు స్తంభాలు

ఇంత నిర్లక్ష్యమా..?

- పదో సెక్టరులో నిరుపయోగంగా విద్యుత్ స్తంభాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళిక గల ప్రాంతంగా పేరొందిన ఎంవీపీ కాలనీలో ఒక్కో ప్రాంతం చూస్తే ఇదేం నిర్వహణ అనిపిస్తోంది. గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ పదో సెక్టరులోని ఓ వీధిలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు గుట్టగా పడేశారు. కేవలం ఒకే చోట మాత్రమే కాకుండా రెండు, మూడు ప్రదేశాల్లో ఇలానే ఉన్నాయి. ఇలా నిన్నా మొన్నటివి కాదు. నెలల తరబడి అక్కడే వదిలేశారు. విద్యుత్ శాఖ వీటిని ఏ సందర్భంలో ఇక్కడకు తీసుకువచ్చారో గాని, అవి అలానే వదిలేయడంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు కాస్త ఇబ్బందిగా మారింది. ఇక్కడ అవసరం లేనప్పుడు వారికి అనువైన చోట పెట్టడమో లేదా అవసరమైన చోటికి తరలించుకోవడమో చేయాలి. కానీ ఇక్కడ స్తంభాలు ఉన్నాయన్న విషయమే మర్చిపోయినట్టున్నారని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నెలల తరబడి అక్కడే పడేయడంతో చుట్టూ చెత్తాచెదారం పేరుకోవడంతో పాటు పురుగులు, విష ప్రాణులు వంటివి చేరుతున్నాయి. పారిశుధ్య నిర్వహణకు కూడా ఆటంకంగా మారింది. అధికారులు స్పందించి ఇక్కడి నుంచి స్తంభాలను తరలించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

నేటి నుంచి వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ డైరెక్టర్స్ ప్రియా, పాల్గొన్న సంధ్యా, సొనాల్

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లిట్ లాంటర్న్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి 2 రోజుల పాటు వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024ను బీచ్‌రోడ్డులో ఉన్న హవామహల్ వేదికగా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ డైరెక్టర్లు ప్రియా ఉప్పలపాటి, సంధ్యా గోడే, సొనాల్ సరా తెలిపారు.

శుక్రవారం సాయంత్రం సిరిపురంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్ ప్రతీ రోజూ సుమారు 44 సెషన్లు ఉంటాయన్నారు. 4 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు గల విద్యార్థుల కోసం ఎక్కువ సెషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆనందించే సెషన్లు కూడా అనేకం ఉన్నాయన్నారు. కొన్ని సెషన్లు తల్లిదండ్రులు, అధ్యాపకుల కోసం ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. ఈ ఫెస్ట్ ప్రారంభోత్సవానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరుకున్నారన్నారు. ఇప్పటికే నమోదు చేసుకున్న 2 వేల స్లాట్లు కాకుండా వాక్ ఆన్ రిజిస్ట్రేషన్ కోసం కొన్ని స్లాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

పేజెస్ బుక్ ఎండీ సునీల్ నెవాటియ మాట్లాడుతూ ఇది ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. విద్యార్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ కథా రచయిత్రి బొంగిస్వా హాజరై వారి సాంస్కృతిక గీతాన్ని ఆలపించారు. కార్యక్రమానికి భాగస్వాములుగా సంధ్యా మెరైన్, దేవీ సీ ఫుడ్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సీఎంఆర్, శారద మెటల్స్, వివన్ మోటల్స్ ఉన్నాయన్నారు.

26న కార్మిక ప్రదర్శనను విజయవంతం చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్కేఎస్వీ కుమార్

మద్దిలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న నిర్వహించనున్న కార్మిక ప్రదర్శన విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలో శుక్రవారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించినా, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ కింద బయటకు పంపినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరుమెదపడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించకపోతే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ భూములు అదానీకి కట్టబెట్టే చర్యలు ఆపాలన్నారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పి.వెంకటరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

26న ఏయూలో ఆవంత్స, ఆరుద్రల శతజయంతి ఉత్సవం



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈ నెల 26న టీయల్ఎన్ సభా హాలులో నిర్వహించనున్న ఆవంత్స సోమసుందర్, ఆరుద్రల శత జయంతి ఉత్సవం జయప్రదం చేయాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు కోరారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానం పత్రికలను శుక్రవారం ఆయన తన ఛాంబర్లో ఏయూ తెలుగు శాఖ అధ్యక్షుడు జర్ర అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి తదితరులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాకవులు ఆవంత్స, ఆరుద్రల శత జయంతి ఉత్సవ నిర్వహణకు యూనివర్సిటీ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలు జయప్రదం కోసం అన్ని విధాలా సహాయసహకారాలుఅందిస్తామని తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షుడు జర్ర అప్పారావు, అరసం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు వివిధ యూనివర్సిటీల ఆచార్యులు, ప్రముఖ కవులు, రచయితలు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉదయం జరిగే మొదటి సదస్సులో 'ఆవంత్స సోమసుందర్ జీవితం-కృషి'పై ఏయూ విశ్రాంత ఆచార్యులు చందు సుబ్బారావు, రెండో సదస్సులో 'ఆరుద్ర జీవితం-కృషి'పై వేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ కీలక ప్రసంగించనున్నట్టు చెప్పారు. వీరితో పాటు ప్రముఖ సాహిత్యవేత్తల ఉపన్యాసాలు కూడా ఉంటాయని వివరించారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు.

దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు!

- చిరు వర్తకులకు చెప్పిన కార్పొరేటర్ మూర్తి యాదవ్
- అలాంటి ఆదేశాలేవీ రాలేదంటున్న జీవీఎంసీ అధికారులు



పీతలవానిపాలెంలో రోడ్డుపై కొలతలు తీయిస్తున్న కార్పొరేటర్ మూర్తి యాదవ్

మద్దిలపాలెం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టులో కేసు వేసి దుకాణాల తొలగింపునకు కారణమయ్యారని 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఆయనను వ్యతిరేకిస్తున్న కొందరు చిరు వ్యాపారులు రోజుకో రూపంలో నిరసన తెలుపుతున్నారు. వీరికి ప్రజా సంఘాలు కూడా మద్దతుగా నిలిచి ఉద్యమాలు తీవ్రతరం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో శుక్రవారం మూర్తియాదవ్ వార్డులోని పీతలవానిపాలెంలో కొందరు దుకాణదారులతో మాట్లాడారు. సచివాలయం సిబ్బందితో వచ్చి రోడ్డుపై కొలతలు తీయించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. తాను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో మాట్లాడానని చెప్పారు. వార్డులో హ్యాకర్ జోన్ ఏర్పాటు చేయాలని కోరగా, ఆయన అంగీకరించినట్టు తెలిపారు. కళాభారతి రోడ్డులో తొలగించిన దుకాణాలను గ్రామ చివరన నిర్మానుష్య ప్రాంతమైన వుడా భవనం సమీపంలో ఏర్పాటు చేయిస్తానని చిరు వర్తకులకు చెప్పారు.

అలాంటి ఆదేశాలేవీ రాలేదు

జీవీఎంసీ 22వ వార్డులో దుకాణాలు ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని జోన్-3 ఏసీపీ మధుసూదనరావు తెలిపారు. వుడా భవనం వద్ద హ్యాకర్ జోన్ ఏర్పాటుకు రఫ్ స్కెచ్ వేయాలని మాత్రమే సిటీ ప్లానర్ ఆదేశించారని చెప్పారు. 22వ వార్డులో దుకాణాలు తొలగించలేదని కార్పొరేటర్ మూర్తియాదవ్ జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్, ఎంవీపీ కాలనీ పోలీసులకు కోర్టు ధిక్కరణ కేసు వేశారని, దీంతో ఈ అంశం ఇంకా కోర్టులోనే ఉందన్నారు. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని ఏసీపీ వెల్లడించారు.

ఆరోగ్యంపై ఫార్మసీ విద్యార్థుల అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బి.ఫార్మసీ విద్యార్థులు

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని రఘు కళాశాల బి.ఫార్మసీ విద్యార్థులు శుక్రవారం 'ఆరోగ్యం గురించి ఆలోచించండి.. ఫార్మసీ గురించి ఆలోచించండి' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం జీవీఎంసీ ఎదురుగా ఉన్న రఘు కాలేజీ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్లకార్డులు చేబూని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు బి.ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జగదీష్ పండా మాట్లాడుతూ రోగుల సంరక్షణకు ఫార్మసిస్టులు చేసే అమూల్యమైన సహకారాన్ని గుర్తిస్తూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కరోనా సమయంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ప్రాథమిక చికిత్స దీర్ఘవ్యాధుల నిర్వహణ, ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్, హెల్త్ క్యాంపుల ద్వారా ఫార్మసిస్ట్‌ల విజ్ఞానం, నైపుణ్యం ప్రజలకు అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.పూర్ణ నాగశ్రీ, కె.పద్మజ, కె.రమాదేవి, స్వాతి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎల్.రమణమ్మ, యు.హరిణి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్రావు




జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, రూ.10 వేల వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.వెంకట్రావు కోరారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన మాటకు భిన్నంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి వలంటీర్ వ్యవస్థ లేదని ప్రకటించడం విశ్వాసఘాతుకమని మండిపడ్డారు. ఈ విధంగా మంత్రి పేర్కొనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకొని వేతనాలు రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు, వలంటీర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాము, లక్ష్మణ్, అజార్, ఆంజనేయులు, వాసు, రాజు, పార్వతీ, వలంటీర్లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కూటమి మోసపూరిత ప్రకటనలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు, సిటు నాయకులు

జగదాంబ కూడలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శుక్రవా రం సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నెల 29న విశాఖలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై అసెంబ్లీ, శాసనమండలిలో చర్చ జరిగిందని, ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయడానికి ప్రభుత్వం నిరాకరించడం కూటమి వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. గతంలో కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన ప్రకటనను కూటమి నేతలు వల్లెవేయడం ఏమిటని ప్రశ్నించారు. గాజువాక అసెంబ్లీ సీటులో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గెలిపిస్తే విశాఖ ఉక్కు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆక్షేపించారు. ఆదానీ కుంభకోణం ప్రపంచాన్నే విస్తుపోయేలా చేసిందని, ఆదానికి అరెస్ట్ వారెంట్ జారీ చేసే దమ్ముందా? అంటూ కేంద్రంలోని పెద్దలను శ్రీనివాసరావు నిలదీశారు. ఈ సమావేశంలో సిటు నాయకులు జగ్గు నాయుడు, కె.లోకనాథం పాల్గొన్నారు.

వ్యక్తిగత జాగ్రత్తలతో వ్యాధులు దూరం

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత జాగ్రత్తలతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు.

కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా యువతకు స్వయం నియంత్రణ ఉండాలన్నారు. మంచి జీవనశైలి ఉంటే ప్రాణాంతక వ్యాధులు దరిచేరవన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకులు విజయప్రతాప్ మాట్లాడుతూ ఎయిడ్స్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో వివరించారు. యువత ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పాలిథిన్ వినియోగిస్తే జరిమానా

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని 45వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ వ్యాపారులను హెచ్చరించారు. నరసింహనగర్‌లోని రైతుబజారులో శుక్రవారం అవగాహన కల్పించారు. గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఎలాంటి తప్పులున్నా, వారిని ఇబ్బంది పెట్టకుండా సరిచేయాలని మండల విద్యాశాఖాధికారి ఎం.రామారావు సిబ్బందిని ఆదేశించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. జనన ధ్రువపత్రం ఉంటేనే తేదీ, పేరులో తప్పులను సరిచేస్తున్నారు.

అజయ్‌బాబుకు శుభాకాంక్షలు



అజయ్‌బాబును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

కంచరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబును శుక్రవారం పార్టీ నాయకులు, అభిమానులు అభినందించారు. తనపై నమ్మకంతో ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గణబాబుకు అజయ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

24న రన్ ఫర్ అంబేడ్కర్

సీతమ్మధార, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు భీమ్‌సేన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవిసిద్దార్థ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుంచి జరిగే కార్యక్రమంలో బౌద్ధులు, దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శ్రీకాంత్, జ్ఞాన శివకుమార్, రవితేజ, రావణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు నిర్వహిస్తున్న అంతర్ కళాశాల పురుషుల మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్ శుక్రవారం ప్రారంభమైంది. గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో పోటీలను వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ప్రారంభించారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం రన్ ఈవెంట్‌లో విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ప్రొఫెసర్‌ఎస్.విజయ్‌మోహన్, డాక్టర్ పల్లవి, పీడీలు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లు ముమ్మరం



కనకమహాలక్ష్మి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో శోభారాణి

జగదాంబ కూడలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయం గర్భగుడి నుంచి వెలుపల వరకు పందిళ్లు, బారికేడ్లు ఏర్పాట్లు పనులను శుక్రవారం ఈవో కె.శోభారాణి, ఏఈ రమణతో కలసి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం లోపల అందంగా తీర్చిదిద్దే పనులు జోరందుకున్నాయి. అమ్మవారికి క్షీరాభిషేకం సేవలను ఆలయంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీవిత బీమా శాఖాధిపతి తనిఖీలు

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సంస్థ శాఖాధిపతి రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పాలసీదారుల రుణాలు, క్లైమ్‌ల పరిష్కారంలో కార్యాలయం సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రభుత్వ ఉద్యోగులకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర సహాయ సంచాలకుడు ఏఆర్కే నాయుడు, సంయుక్త సంచాలకులు ఎం.ఝాన్సీ లక్ష్మి, కె.కనికరం బాబు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం మెట్టు వద్ద నిత్యం ట్రాఫిక్ అవస్థలే!



మెట్టు నుంచి ఆర్పీపేట వెళ్లే స్కూల్ రోడ్డును ఇరువైపులా ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బళ్లు

కంచరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి రామ్మూర్తిపంతులపేట పాఠశాలకు మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మెట్టు బ్రిడ్జి ప్రారంభం నుంచి ఆర్పీపేట రైల్వే గేటు వరకు సర్వీస్ రోడ్డు ఉంది. దీనిని ఇరువైపులా తోపుడు బళ్లు, చిరు వర్తకులు ఆక్రమించడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో ప్రక్క ఇక్కడ పాఠశాలలకు వేలాదిగా విద్యార్థులు వస్తుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం రద్దీని సంతరించుకుంటోంది. సమీపంలోనే పోలీస్ బీట్ ఉన్నా ట్రాఫిక్ సమస్యను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

'పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు పరం చేయొద్దు'



నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేటు పరం చేసే యోచన విరమించుకోవాలని పోర్టు వీడీఎల్‌బీ, డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరహార దీక్షలు శుక్రవారానికి 53వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్స్ తెరిచే తేదీ వాయిదా వేశారన్నారు. వాటిని పూర్తిగా రద్దుచేయాలన్నారు. దశాబ్దాలుగా వేలాది మందికి సేవలందిస్తున్న పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, ఎంవీ రాఘవులు, పి.శంకరరావు, సీహెచ్ త్రినాథరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జీఎస్ఐ ఉద్యోగుల అథ్లెటిక్స్ మీట్



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌అండ్‌బి జంక్షన్ హైవే రోడ్డులో ఉన్న జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అథ్లెటిక్స్ మీట్ 2024 పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఉదయం ఉద్యోగుల పోటీలను జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ అసిత్ సాహా, అధికారుల బృందం ప్రారంభించారు. షాట్ పుట్, పరుగు పందెం తదితర క్రీడల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు రోలింగ్ ట్రోఫీలు, ప్రోత్సాహక బహుమతుల్ని అందించారు. పారాలింపియన్ రొంగలి రవి క్రీడా ప్రతిభను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జీఎస్ఐ అధికారులు ఎస్.ఎం.షరీఫ్, సుజిత్‌కుమార్ త్రిపాఠి పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల చెంతకు అక్కాచెల్లెళ్లు

సీతంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే కొత్త కాలనీ వద్ద ఈనెల 19న తప్పిపోయిన ఎ.విజయలక్ష్మి (55), సుధాపుష్ప కుమారి (66)లను నాలుగో పట్టణ సీఐ విజయకుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి పట్టుకున్నారు. వారి సోదరుడు నాగేశ్వరరావుకు అప్పగించారు. మరో కేసులో నెల్లూరుకి చెందిన మానసిక వికలాంగురాలు హర్షిత ఆచూకీ కనిపెట్టి కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. సీపీ శంఖబ్రత బాగ్చి సిబ్బందిని అభినందించారు.

ఏడుగురు నిరాశ్రయులకు ఆశ్రయం

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దిక్కుతోచని స్థితిలో ఉన్న ఏడుగురు వృద్ధులను ఏయూటీడీ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించినట్టు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజన్, గోపాలపట్నానికి చెందిన అరటిపట్ల చిన్నారావు, మధ్యప్రదేశ్‌కు చెందిన సుబాలాల్, ఎల్.కోటకు చెందిన చల్లం నాయుడు, విజయవాడకు చెందిన యలమంచిలి శ్రీనివాసరావు, కొత్తవలసకు చెందిన స్వారంపూడి వసుంధర, విజయవాడకు చెందిన తాటి రాణిలకు వసతిగృహాల్లో ఆశ్రయం కల్పించామన్నారు.

గౌరీ పరమేశ్వరులకు సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా జగ్గారావు బ్రిడ్జి సమీపంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణానగర్ కాళ్ళ వారి తోట గౌరీ సేవా సంఘం సభ్యులు శుక్రవారం సారె సమర్పించారు. రామకృష్ణానగర్‌లోని



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి శంకువాని పాలెం, ఎన్టీ కాలేజీ, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, మహారాణి పార్లర్ మీదుగా సారెను భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, సంఘం అధ్యక్షుడు కాళ్ళ సూర్యప్రకాశ్, బొడ్డేటి రవికుమార్, కొణతాల గోవింద్, కిరణ్, నాగేశ్వరరావు, వెంకటరావు, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మాధవధార: స్థానిక మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సింహాచల దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో అర్చకులు శ్రీనివాసశర్మ, పండితులు వేడుకలు జరిపారు. కళా వేదికపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి జరిపిన కల్యాణ క్రతువులో కార్పొరేటరు రెయ్యి వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

సందడిగా కార్తీక దీపోత్సవం

సీతమ్మధార: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవంలో భాగంగా శ్రీకృష్ణ మందిరం వద్ద దీపోత్సవం నిర్వహించారు. తులసి దేవికి, వెంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

వేడుక చేసుకోవాలంటే వేదన తప్పదు

నగర నడిబొడ్డున కమ్యూనిటీ హాల్ కరువు



డాబాగార్డెన్స్ జంక్షన్ ప్రాంతం

డాబాగార్డెన్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్ ప్రాంతమంటే తెలియనివారుండరు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతానికి ఇంతవరకు కనీసం కమ్యూనిటీ హాల్ నిర్మించలేదు. దీంతో ప్రజలకు అసౌకర్యంగా ఉంది. వివిధ వర్గాల ప్రజలు సామాజిక కార్యక్రమాలు, పెళ్లిళ్లు.. ఇతరత్రా వేడుకలు జరుపుకొనేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఎమ్మెల్యేలు ఇక్కడ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. వార్డులో సగానికిపైగా వాణిజ్య ప్రాంతం కావడంతో దశాబ్దాలుగా నివసిస్తున్న స్థానికులు ఏదైనా కార్యక్రమం తలపెడితే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. వార్డులో అవసరాలు గుర్తించి తక్షణమే వాటిని ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లపైనే చిన్న చిన్న షామియా నాలు వేసుకుని దిగువ మధ్యతరగతి ప్రజలు, పేదలు కార్యక్రమాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రోడ్డుగుండా నిత్యం జిల్లా ఉన్నతాధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధులు వెళ్తున్నా స్థానికుల అవసరాలేమిటన్నది ఏనాడు విచారించలేదని ఆక్రోశిస్తున్నారు. ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.

కమ్యూనిటీ హాల్ తక్షణావసరం

వార్డులోని కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి. దీనివల్ల అన్ని వర్గాలవారికి సౌకర్యంగా ఉంటుంది. చిన్న చిన్న కార్యక్రమాలు, ఇతరత్రా సమావేశాలు నిర్వహించడానికి ఇబ్బందికరంగా ఉంటోంది. కమ్యూనిటీ కల్యాణ మండపం వంటివి నిర్మిస్తే వార్డు ప్రజలు అన్ని కార్యక్రమాలు ఇక్కడే చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది.

- వై.సూరీడు, రిటైర్డ్ ఉద్యోగి

రోడ్డున పడుతున్నాం

ఇంటి నుంచి కొంచెం దూరంలోనే ముఖ్య రహదారి వచ్చేస్తోంది. దీంతో ఏ కార్యక్రమం, సమావేశాలు జరుపుకొనే వీలు లేకుండా ఉంటుంది. ఏ అవసరం తీర్చుకోవాలన్నా రోడ్డున పడుతున్నాం. వార్డు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. అధికారులు ఈ సమస్యను ప్రాధాన్య అవసరంగా గుర్తించాలి.

-ఎ.రేవతి, రంగాస్ట్రీట్

కిశోర్ బాలికల వికాసంపై శ్రద్ధ చూపాలి

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) కిశోర్ బాలికల ఆరోగ్యం, చదువుపై అధికారులు శ్రద్ధ వహించాలని, వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర్ వికాసంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడుతూ బాలికలకు రక్షణ కల్పించాలని, క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం, వైద్యపరమైన సేవలు అందించాలని ఆదేశించారు. అందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్ళేలా తర్ఫీదు ఇవ్వాలని వారిలో ఆత్మవిశ్వాసం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ జయాదేవి, ఎంఆర్ఎల్ రాధ, మల్లేశ్వరి, జానకి, డాక్టర్ సమత జీవన రాణి పాల్గొన్నారు.

సిరివినాయక తిరువీధి మహోత్సవాలు

అల్లిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం నేరెళ్లకోనేరు వీధిలోని శ్రీ సిరి వినాయక ఆలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అభివృద్ధి సంఘం శుక్రవారం తిరువీధి మహోత్సవాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఈనెల 25 వరకు కొనసాగుతాయన్నారు.ఆదే రోజు స్వామివారి ఆలయం వద్ద మహాఅన్నసమారాధన కార్యక్రమం ఉంటుదన్నారు .కమిటీ అధ్యక్షుడు రమేష్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పిల్లల శస్త్రచికిత్స గది ప్రారంభం



గదిని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిబాబు

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో ఆధునిక సాంకేతిక విధానాలతో నిర్మించిన పిల్లల శస్త్రచికిత్స గది (పిడియాట్రిక్ సర్జరీ కాంప్లెక్స్)ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు శుక్రవారం ప్రారంభించారు, ఆంధ్ర వైద్య కళాశాల పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో అడ్వాన్స్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను వీరు ప్రారంభించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సరికొత్త లాప్రోస్కోపిక్ పరికరం తీసుకొచ్చారు. ఇది శస్త్ర చికిత్స ఖచ్చితత్వాన్ని మెరుగుపరుస్తుంది. రోగులు కోలుకునే సమయాన్ని తగ్గిస్తుంది. మెరుగైన ఆరోగ్య ఫలితాలనిస్తుంది. తద్వారా నిరుపేద పిల్లలకు ప్రయోజనం చేకూరుతుంది. పిల్లల శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ గిరీష్ దీక్షిత్, జోసెఫ్ కిరణ్, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయవాదుల నిరసన

నగరంలో న్యాయ కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కోర్టు గేటు వద్ద న్యాయవాదులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు కఠిన తీసుకోవాలని కోరారు.

- డాబాగార్డెన్స్, ఆంధ్రజ్యోతి

సంక్షేమ హాస్టళ్ల ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

బాధ్యత ఉంది. నగర పోలీస్ కమిషనర్‌కు బాలికల వసతి గృహాలకు సంబంధించిన జాబితాను అధికారులు అందించారు. రాత్రివేళల్లో ఆయా పరిసరాల్లో పెట్రోలింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. మెనూ అమలును ఉన్నతాధికారులను పర్యవేక్షించాలి.

మెరుగైన ఫలితాలు

హాస్టళ్లలో ఉండే విద్యార్థుల చదువుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. మెరుగైన ఫలితాలను సాధించేలా ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షల ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. ఇంటర్, డిగ్రీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యాన్ని ప్రణాళికలో చేర్చారు. ఇందుకోసం ట్యూటర్స్‌ను నియమించుకోవాలి. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలి. గ్రేడ్లు కేటాయించాలి. క్విజ్ పోటీలు నిర్వహించాలి. మోటివేషనల్ క్లాసులను నిర్వహించాలి. వార్డెన్స్ స్కూల్ టీచర్లతో మాట్లాడి విద్యార్థులను చదువులో మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలను సిద్ధంచేయాలి. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి. అడ్మిషన్లు పూర్తిగా అయ్యేలా చూడడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించి చదువులో రాణించేలా చూడడం, క్రీడా పోటీలు నిర్వహించాలి.

యాక్షన్ ప్లాన్ అమలుకు స్పష్టమైన ఆదేశాలు

గత నెలాఖరు నుంచి వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా షెడ్యూల్‌ను తయారుచేశాం. ఇప్పటికే హాస్టల్ వార్డెన్స్‌కు షెడ్యూల్‌ను అందించి అమలుకు ఆదేశించాం. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతోపాటు చదువులో రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. మెనూ అమలు, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అంశాలపై దృష్టిసారించాం. ట్యూటర్ల నియామకం, మోటివేషనల్ క్లాస్‌ల నిర్వహణకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నాం.

- కె.రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

శభాష్ నితీష్

... 5వ పేజీ తరువాయి

ఒక సిక్సర్‌తో 41 పరుగులు చేసి..చివరి వికెట్‌గా పెవెలియన్‌కు చేరాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకు ఆలౌట్ కాగా అందులో నితీష్‌కుమార్‌రెడ్డి చేసిన 41 పరుగులే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన నితీష్‌కుమార్‌రెడ్డి.. సెలక్టర్లను ఆకట్టుకున్నాడు. దీంతో స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఢిల్లీలో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారీ హాఫ్ సెంచరీతో (74; 4 బౌండరీలు, 7 సిక్సర్లు) సత్తా నిరూపించుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించి భారత్ జట్టులో చోటు దక్కించుకోవడమే కాకుండా తొలి టెస్టులోనే తన ప్రతిభను నిరూపించుకున్నాడు.

సింహాచలం భూ సమస్య పరిష్కరించండి

... 5వ పేజీ తరువాయి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామనే విశ్వాసంతోనే ప్రజలు భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. దేవదాయ శాఖ అధికారులు అంశం కోర్టు పరిధిలో ఉందని అస్పష్టమైన సమాధానం చెప్పి తప్పించుకోవడం సరికాదన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ఇళ్లు కోల్పోయిన బాధితులు వారి కట్టడాల వెనుక ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను కలుపుకొని నిర్మాణం చేపట్టుకోవడానికి దేవస్థానం, జీవీఎంసీల నుంచి అభ్యంతరం లేకుండా చూడాలని కోరారు. దేవస్థానం క్రమబద్ధీకరించబోయే 12,419 కట్టడాలకు ప్రత్యామ్నాయంగా ఇవ్వబోయే ప్రభుత్వ భూముల బదలాయింపు త్వరగా పూర్తిచేయాలని గంటా కోరారు.

సమాన విలువైన భూములే ఇస్తున్నారు

ప్రజలు గృహాలు నిర్మించుకున్న దేవస్థానం భూముల విలువ లెక్కించి ఆ విలువకు సమానమైన భూములు (రూ.5,377 కోట్లు) ప్రత్యామ్నాయంగా ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఈ ప్రక్రియ వేగవంతంగా జరగడం లేదన్నారు. టీడీపీ 2014లో గెలిచినప్పుడు విశాఖలో నిర్వహించిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే దీనిపై తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, త్వరగా భూముల బదలాయింపు పూర్తిచేసి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

- వెలగపూడి రామకృష్ణబాబు, తూర్పు ఎమ్మెల్యే

ధర్మకర్తలతో మాట్లాడతాం: దేవదాయ శాఖా మంత్రి ఆనం

ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలపై దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. రూ.5,377 కోట్ల విలువైన భూములు దేవస్థానానికి ఇస్తున్నట్టు హైకోర్టుకు తెలియజేసి, 12,419 కట్టడాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ఈ పంచ గ్రామాల సమస్యపై విశాఖలో ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. ఖాళీ స్థలాలకు గతంలోనే ధరలు నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలతోనే మాట్లాడతామని హామీ ఇచ్చారు.

కల్తీపై కొరడా

... 5వ పేజీ తరువాయి

వెలువరించారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, శుక్రవారం విచారణ పూర్తికావడంతో అడిషినల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు తెలిపారు. కల్తీ చేస్తున్నట్టు అనుమానం ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. కల్తీ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్సులు కూడా రద్దుచేస్తామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

విశాఖ-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.చిన్నారావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ చంద్రశేఖరవర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణ పూర్తయ్యే వరకు విశాఖపట్నం వదిలి వెళ్లకూడదని ఆదేశించారు. చిన్నారావు ప్రస్తుతం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు ఆయన సస్పెండ్ కావడంతో ఆ బాధ్యతలను విశాఖపట్నం-1 ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు అప్పగించారు. ఇప్పటికే తగిన వనరులు లేక అన్ని పరిశ్రమలను సకాలంలో తనిఖీ చేయలేకపోతున్నామని అధికారులు వాపోతున్నారు. ఈ సమయంలో ఏకంగా రెండు జిల్లాల బాధ్యతలను ఇంకో అధికారికి అప్పగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అనకాపల్లి జిల్లాలో అత్యధిక సంఖ్యలో పరిశ్రమలున్నాయి. అక్కడే నిత్యం ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ఒక్కరిపైనే భారం మోపకుండా మరో అధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. సకాలంలో తనిఖీలు నిర్వహించకపోతే ప్రమాదాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ఇదిలావుండగా పి.చిన్నారావు సస్పెన్షన్‌కు కారణాలేమిటో సంబంధిత శాఖ అధికారులు వెల్లడించడం లేదు.

పని ప్రదేశాల్లో నిబంధనలు పాటించాలి: ఏసీపీ



కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులంతా తమ పనిలో జాగ్రత్తలు, నిబంధనలు, అధికారుల సూచనలను పాటించాలని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. పోర్టు ఆసుపత్రి సమీపంలో ఇన్‌ఆర్బిటల్ మాల్ నిర్మాణ కార్మికులతో నాలుగో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. మద్యం తాగి పనులు చేయకూడదని, పై అంతస్తులలో పనిచేసే వారు సెఫ్టీ హెల్మెట్‌ను ధరించాలని, బెల్టులు పెట్టుకోవాలని సూచించారు. అదే విధంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా, ఎవరైనా నేరాలకు పాల్పడినా నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మొబైల్ నంబరు 7995095799కు ఫోను చేసి సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

24న బాలబాలికలకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెల 24 బాలబాలికలకు ఉచితంగా నృత్యం, చిత్రలేఖనం, సంగీత విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో ఆదివారం ఉదయం 10 నుంచి 12 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు వినియోగించుకోవాలని కోరారు.

ఉక్కు ఉద్యోగుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వేతనాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని సీఐటీయూ గౌరవధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం వద్ద నగదు నిల్వలు ఉన్నప్పటికీ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



తిరువీధిలో అమ్మవార్లకు పూజలు

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సాయంత్రం చతుర్భుజి తాయరు, సింహవల్లీ తాయార్ అమ్మవార్ల తిరువీధి ఉత్సవంవైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిలో ఉంచి ఆలయవిద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. మార్గం పొడవునా అష్టదిక్పాలకులకు పూజలు చేసి ప్రత్యేక ఫలాల నివేదనలు చేశారు.

180 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కురపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు జరిపారు. మందులను ఉచితంగా అందజేశారు.

భీమిలి ఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మెడికవర్ వైద్యులు జయసాయి చంద్, రాజు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో క్యాంప్ సమన్వయ అధికారి రవికిరణ్, కర్రోతు దుర్గరాజు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)

● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 36, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 34, క్యారెట్ 70 దొండకాయలు 34, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 46, కీర దోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

చిట్టడవులా! ఫుట్‌పాత్‌లా!!



కృష్ణాపురం నుంచి పైనాపిల్ కాలనీ వైపు వెళ్లే ఫుట్‌పాత్‌పై పెరిగిన పొదలు

- 13వ వార్డు ఫుట్‌పాత్‌లపై దట్టంగా పెరిగిన తుప్పలు
- ఏళ్ల తరబడి జంగిల్ క్లియరెన్స్ చేపట్టని అధికారులు
- వాకర్స్‌కు తప్పని ఇబ్బందులు

ఆరిలోవ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల శ్రీకృష్ణాపురం నుంచి పైనాపిల్ కాలనీ వైపు వెళ్లే సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌లు పొదలతో నిండిపోయాయి. గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడంతో కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లు కనిపించని పరిస్థితి నెలకొని ఉంది. దీంతో పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పోతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు కావడంతో ఈ మార్గం విశాలంగా ఉంటుంది. దీంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయి. సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనాలు, స్థానికులు వివిధ వెహికల్స్‌పై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ సర్వీసు రోడ్డులో ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేస్తుంటారు. వీరిలో ఎక్కువ శాతం వృద్ధులు, మహిళలు ఉంటారు. ఆరోగ్య పరిరక్షణ భాగంగా వీరు వాకింగ్ చేస్తూ ఉంటారు. కొందరు డ్రైవింగ్ నేర్చుకోవడానికి కూడా ఇక్కడకే వస్తుంటారు. వీరంతా సర్వీసు రోడ్డులోనే వినియోగిస్తుంటారు. అయితే ఇక్కడ ఉన్న ఫుట్‌పాత్‌లపై దట్టంగా తుప్పలు పెరిగిపోవడంతో వాకింగ్ చేసే వారికి, పాదచారులకు ఇబ్బందిగా మారింది. వీరంతా ప్రత్యామ్నాయం లేకపోవడంతో సర్వీసు రోడ్డునే వినియోగిస్తుంటారు. దీంతో ఎప్పుడే ఏ వాహనం ఢీకొంటుందోనన్న భయం వీరిలో వెన్నాడుతుంటుంది. తుప్పలు పెరిగిపోవడంతో వాకింగ్‌కు వచ్చే మహిళలు చైన్ స్నాచింగ్‌లు జరుగుతాయో ఏమోనని ఆందోళన చెందుతుంటారు. ఫుట్‌పాత్‌లపై తుప్పలు దట్టంగా పెరగడంతో విష ప్రాణుల భయం కూడా ఉంది. దీంతో ఎవరూ ఫుట్‌పాత్‌లపై నడిచే సాహసం చేయడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లపై జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదని, దీంతో కొన్ని చోట్ల చిట్టడవిలా కనిపిస్తుంటుదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనాజీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే ఫుట్‌పాత్‌లపై తుప్పలను తొలగించాలని కోరుతున్నారు.



కొత్త గోశాల నుంచి శ్రీకృష్ణాపురం వైపు వెళ్లే మార్గంలో ఫుల్‌పాత్



పదో సెక్టరులో రోడ్డు పక్కన పడేసిన విద్యుత్తు స్తంభాలు

ఇంత నిర్లక్ష్యమా..?

- పదో సెక్టరులో నిరుపయోగంగా విద్యుత్ స్తంభాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళిక గల ప్రాంతంగా పేరొందిన ఎంవీపీ కాలనీలో ఒక్కో ప్రాంతం చూస్తే ఇదేం నిర్వహణ అనిపిస్తోంది. గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ పదో సెక్టరులోని ఓ వీధిలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు గుట్టగా పడేశారు. కేవలం ఒకే చోట మాత్రమే కాకుండా రెండు, మూడు ప్రదేశాల్లో ఇలానే ఉన్నాయి. ఇలా నిన్నా మొన్నటివి కాదు. నెలల తరబడి అక్కడే వదిలేశారు. విద్యుత్ శాఖ వీటిని ఏ సందర్భంలో ఇక్కడకు తీసుకువచ్చారో గాని, అవి అలానే వదిలేయడంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు కాస్త ఇబ్బందిగా మారింది. ఇక్కడ అవసరం లేనప్పుడు వారికి అనువైన చోట పెట్టడమో లేదా అవసరమైన చోటికి తరలించుకోవడమో చేయాలి. కానీ ఇక్కడ స్తంభాలు ఉన్నాయన్న విషయమే మర్చిపోయినట్టున్నారని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. నెలల తరబడి అక్కడే పడేయడంతో చుట్టూ చెత్తాచెదారం పేరుకోవడంతో పాటు పురుగులు, విష ప్రాణులు వంటివి చేరుతున్నాయి. పారిశుధ్య నిర్వహణకు కూడా ఆటంకంగా మారింది. అధికారులు స్పందించి ఇక్కడి నుంచి స్తంభాలను తరలించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

26న కార్మిక ప్రదర్శనను విజయవంతం చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్కెఎస్వీ కుమార్

మద్దిలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న నిర్వహించనున్న కార్మిక ప్రదర్శన విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలో శుక్రవారం నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించినా, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ కింద బయటకు పంపినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరుమెదపడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించకపోతే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ భూములు అదానీకి కట్టబెట్టే చర్యలు ఆపాలన్నారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పి.వెంకటరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

26న ఏయూలో ఆవంత్స, ఆరుద్రల శతజయంతి ఉత్సవం



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈ నెల 26న టీయల్ఎన్ సభాహాలులో నిర్వహించనున్న ఆవంత్స సోమసుందర్, ఆరుద్రల శత జయంతి ఉత్సవం జయప్రదం చేయాలని ఏయూ వీసీ జి.శశిభూషణరావు కోరారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానం పత్రికలను శుక్రవారం ఆయన తన చాంబర్లో ఏయూ తెలుగు శాఖ అధ్యక్షుడు జర్ర అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి తదితరులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాకవులు ఆవంత్స, ఆరుద్రల శత జయంతి ఉత్సవ నిర్వహణకు యూనివర్సిటీ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలు జయప్రదం కోసం అన్ని విధాలా సహాయసహకారాలుఅందిస్తామని తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షుడు జర్ర అప్పారావు, అరసం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సీఎస్ క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు వివిధ యూనివర్సిటీల ఆచార్యులు, ప్రముఖ కవులు, రచయితలు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉదయం జరిగే మొదటి సదస్సులో 'ఆవంత్స సోమసుందర్ జీవితం-కృషి'పై ఏయూ విశ్రాంత ఆచార్యులు చందు సుబ్బారావు, రెండో సదస్సులో 'ఆరుద్ర జీవితం-కృషి'పై వేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ కీలక ప్రసంగించనున్నట్టు చెప్పారు. వీరితో పాటు ప్రముఖ సాహిత్యవేత్తల ఉపన్యాసాలు కూడా ఉంటాయని వివరించారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ డైరెక్టర్స్ ప్రియా, పాల్గొన్న సంధ్యా, సానాల్

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లిట్ లాంటర్న్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి 2 రోజుల పాటు వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024ను బీచ్‌రోడ్డులో ఉన్న హవామహల్ వేదికగా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ డైరెక్టర్లు ప్రియా ఉప్పలపాటి, సంధ్యా గోడే, సానాల్ సరా తెలిపారు.

శుక్రవారం సాయంత్రం సిరిపురంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్ ప్రతీ రోజూ సుమారు 44 సెషన్లు ఉంటాయన్నారు. 4 నుంచి 16 ఏళ్ల మధ్య వయసు గల విద్యార్థుల కోసం ఎక్కువ సెషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆనందించే సెషన్లు కూడా అనేకం ఉన్నాయన్నారు. కొన్ని సెషన్లు తల్లిదండ్రులు, అధ్యాపకుల కోసం ప్రత్యేకంగా ఉన్నాయన్నారు. ఈ ఫెస్ట్ ప్రారంభోత్సవానికి విశాఖ ఎంపీ శ్రీభరత్ హాజరుకున్నారన్నారు. ఇప్పటికే నమోదు చేసుకున్న 2 వేల స్లాట్లు కాకుండా వాక్ ఆన్ రిజిస్ట్రేషన్ కోసం కొన్ని స్లాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

పేజెస్ బుక్ ఎండీ సునీల్ నెవాటియ మాట్లాడుతూ ఇది ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. విద్యార్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ కథా రచయిత్రి బొంగిస్వా హాజరై వారి సాంస్కృతిక గీతాన్ని ఆలపించారు. కార్యక్రమానికి భాగస్వాములుగా సంధ్యా మెరైన్, దేవీ సీ ఫుడ్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సీఎంఆర్, శారద మెటల్స్, వివన్ మోటల్స్ ఉన్నాయన్నారు.

దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు!



పీతలవానిపాలెంలో రోడ్డుపై కొలతలు తీయిస్తున్న కార్పొరేటర్ మూర్తి యాదవ్

- చిరు వర్తకులకు చెప్పిన కార్పొరేటర్ మూర్తి యాదవ్
- అలాంటి ఆదేశాలేవీ రాలేదంటున్న జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టులో కేసు వేసి దుకాణాల తొలగింపునకు కారణమయ్యారని 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఆయనను వ్యతిరేకిస్తున్న కొందరు చిరు వ్యాపారులు రోజుకో రూపంలో నిరసన తెలుపుతున్నారు. వీరికి ప్రజా సంఘాలు కూడా మద్దతుగా నిలిచి ఉద్యమాలు తీవ్రతరం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో శుక్రవారం మూర్తియాదవ్ వార్డులోని పీతలవానిపాలెంలో కొందరు దుకాణదారులతో మాట్లాడారు. సచివాలయం సిబ్బందితో వచ్చి రోడ్డుపై కొలతలు తీయించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. తాను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో మాట్లాడానని చెప్పారు. వార్డులో హ్యాకర్ జోన్ ఏర్పాటు చేయాలని కోరగా, ఆయన అంగీకరించినట్టు తెలిపారు. కళాభారతి రోడ్డులో తొలగించిన దుకాణాలను గ్రామ చివరన నిర్మానుష్య ప్రాంతమైన వుడా భవనం సమీపంలో ఏర్పాటు చేయిస్తానని చిరు వర్తకులకు చెప్పారు.

అలాంటి ఆదేశాలేవీ రాలేదు

జీవీఎంసీ 22వ వార్డులో దుకాణాలు ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని జోన్-3 ఏసీపీ మధుసూదనరావు తెలిపారు. వుడా భవనం వద్ద హ్యాకర్ జోన్ ఏర్పాటుకు రఫ్ స్కెచ్ వేయాలని మాత్రమే సిటీ ప్లానర్ ఆదేశించారని చెప్పారు. 22వ వార్డులో దుకాణాలు తొలగించలేదని కార్పొరేటర్ మూర్తియాదవ్ జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్, ఎంవీపీ కాలనీ పోలీసులకు కోర్టు ధిక్కరణ కేసు వేశారని, దీంతో ఈ అంశం ఇంకా కోర్టులోనే ఉందన్నారు. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉందని ఏసీపీ వెల్లడించారు.

ఆరోగ్యంపై ఫార్మసీ విద్యార్థుల అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బి.ఫార్మసీ విద్యార్థులు

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పార్మశీ వారోత్సవాలను పురస్కరించుకొని రఘు కళాశాల బి.ఫార్మసీ విద్యార్థులు శుక్రవారం 'ఆరోగ్యం గురించి ఆలోచించండి.. ఫార్మసీ గురించి ఆలోచించండి' నినాదంతో ర్యాలీ నిర్వహించారు.శుక్రవారం జీవీఎంసీ ఎదురుగా ఉన్న రఘు కాలేజీ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్లకార్డులు చేబూని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు బి.ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జగదీష్ పండా మాట్లాడుతూ రోగుల సంరక్షణకు ఫార్మసిస్టులు చేసే అమూల్యమైన సహకారాన్ని గుర్తిస్తూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కరోనా సమయంలో ఫార్మసిస్టల పాత్ర చాలా గొప్పదని కొనియాడారు. ప్రాథమిక చికిత్స దీర్ఘవ్యాధుల నిర్వహణ, ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్, హెల్త్ క్యాంపుల ద్వారా ఫార్మసిస్టల విజ్ఞానం, నైపుణ్యం ప్రజలకు అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.పూర్ణ నాగశ్రీ, కె.పద్మజ, కె.రమాదేవి, స్వాతి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎల్.రమణమ్మ, యు.హరిణి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్రావు




జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, రూ.10 వేల వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.వెంకట్రావు కోరారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చెప్పిన మాటకు భిన్నంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి వలంటీర్ వ్యవస్థ లేదని ప్రకటించడం విశ్వాసఘాతుకమని మండిపడ్డారు. ఈ విధంగా మంత్రి పేర్కొనడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకొని వేతనాలు రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యూఎస్ఎన్ రాజు, వలంటీర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గందం దీప్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాము, లక్ష్మణ్, ఆజార్, ఆంజనేయులు, వాసు, రాజు, పార్వతీ, వలంటీర్లు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కూటమి మోసపూరిత ప్రకటనలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు, సిటు నాయకులు

జగదాంబ కూడలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శుక్రవా రం సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నెల 29న విశాఖలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై అసెంబ్లీ, శాసనమండలిలో చర్చ జరిగిందని, ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయడానికి ప్రభుత్వం నిరాకరించడం కూటమి వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. గతంలో కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన ప్రకటనను కూటమి నేతలు వల్లెవేయడం ఏమిటని ప్రశ్నించారు. గాజువాక అసెంబ్లీ సీటులో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గెలిపిస్తే విశాఖ ఉక్కు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆక్షేపించారు. ఆదానీ కుంభకోణం ప్రపంచాన్నే విస్తుపోయేలా చేసిందని, ఆదానికి అరెస్ట్ వారెంట్ జారీ చేసే దమ్ముందా? అంటూ కేంద్రంలోని పెద్దలను శ్రీనివాసరావు నిలదీశారు. ఈ సమావేశంలో సిటు నాయకులు జగ్గు నాయుడు, కె.లోకనాథం పాల్గొన్నారు.

వ్యక్తిగత జాగ్రత్తలతో వ్యాధులు దూరం

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత జాగ్రత్తలతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు.

కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా యువతకు స్వయం నియంత్రణ ఉండాలన్నారు. మంచి జీవనశైలి ఉంటే ప్రాణాంతక వ్యాధులు దరిచేరవన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకులు విజయప్రతాప్ మాట్లాడుతూ ఎయిడ్స్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుందో వివరించారు. యువత ఎయిడ్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, బి.లక్ష్మి, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం ఆగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

పాలిథిన్ వినియోగిస్తే జరిమానా

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని 45వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ వ్యాపారులను హెచ్చరించారు. నరసింహనగర్‌లోని రైతుబజారులో శుక్రవారం అవగాహన కల్పించారు. గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఎలాంటి తప్పులున్నా, వారిని ఇబ్బంది పెట్టకుండా సరిచేయాలని మండల విద్యాశాఖాధికారి ఎం.రామారావు సిబ్బందిని ఆదేశించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. జనన ధ్రువపత్రం ఉంటేనే తేదీ, పేరులో తప్పులను సరిచేస్తున్నారు.

అజయ్‌బాబుకు శుభాకాంక్షలు



అజయ్‌బాబును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

కంచరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబును శుక్రవారం పార్టీ నాయకులు, అభిమానులు అభినందించారు. తనపై నమ్మకంతో ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గణబాబుకు అజయ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

24న రన్ ఫర్ అంబేడ్కర్

సీతమ్మధార, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు భీమ్‌సేన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవిసిద్ధార్థ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం నుంచి జరిగే కార్యక్రమంలో బౌద్ధులు, దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శ్రీకాంత్, జ్ఞాన శివకుమార్, రవితేజ, రావణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు నిర్వహిస్తున్న అంతర్ కళాశాల పురుషుల మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్ శుక్రవారం ప్రారంభమైంది. గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో పోటీలను వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ప్రారంభించారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం రన్ ఈవెంట్‌లో విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ప్రొఫెసర్‌ఎస్.విజయ్‌మోహన్, డాక్టర్ పల్లవి, పీడీలు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లు ముమ్మరం



కనకమహాలక్ష్మి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో శోభారాణి

జగదాంబ కూడలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయం గర్భగుడి నుంచి వెలుపల వరకు పందిళ్లు, బారికేడ్లు ఏర్పాట్లు పనులను శుక్రవారం ఈవో కె.శోభారాణి, ఏఈ రమణతో కలసి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం లోపల అందంగా తీర్చిదిద్దే పనులు జోరందుకున్నాయి. అమ్మవారికి క్షీరాభిషేకం సేవలను ఆలయంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీవిత బీమా శాఖాధిపతి తనిఖీలు

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సంస్థ శాఖాధిపతి రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పాలసీదారుల రుణాలు, క్లైమ్‌ల పరిష్కారంలో కార్యాలయం సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రభుత్వ ఉద్యోగులకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర సహాయ సంచాలకుడు ఏఆర్‌కే నాయుడు, సంయుక్త సంచాలకులు ఎం.ఝాన్సీ లక్ష్మి, కె.కనికరం బాబు, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం మెట్టు వద్ద నిత్యం ట్రాఫిక్ అవస్థలే!

కంచరపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం మెట్టు నుంచి రామ్మూర్తిపంతులపేట పాఠశాలకు మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మెట్టు బ్రిడ్జి ప్రారంభం నుంచి ఆర్పీపేట రైల్వే గేటు వరకు సర్వీస్ రోడ్డు ఉంది. దీనిని ఇరువైపులా తోపుడు బళ్లు, చిరు వర్తకులు ఆక్రమించడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరో ప్రక్క ఇక్కడ పాఠశాలలకు వేలాదిగా విద్యార్థులు వస్తుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం రద్దీని సంతరించుకుంటోంది. సమీపంలోనే పోలీస్ బీట్ ఉన్నా ట్రాఫిక్ సమస్యను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



మెట్టు నుంచి ఆర్పీపేట వెళ్లే స్కూల్ రోడ్డును ఇరువైపులా ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బళ్లు

'పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు పరం చేయొద్దు'

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేటు పరం చేసే యోచన విరమించుకోవాలని పోర్టు వీడీఎల్‌బీ, డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి ఎదుట నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు శుక్రవారానికి 53వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్స్ తెరిచే తేదీ వాయిదా వేశారన్నారు. వాటిని పూర్తిగా రద్దుచేయాలన్నారు. దశాబ్దాలుగా వేలాది మందికి సేవలందిస్తున్న పోర్టు ఆస్పత్రిని ప్రైవేటీకరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, ఎంవీ రాఘవులు, పి.శంకరరావు, సీహెచ్ త్రినాథరావు పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

ఉత్సాహంగా జీఎస్ఐ ఉద్యోగుల అథ్లెటిక్స్ మీట్

మురళీనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్‌అండ్‌బి జంక్షన్ హైవే రోడ్డులో ఉన్న జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అథ్లెటిక్స్ మీట్ 2024 పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఉదయం ఉద్యోగుల పోటీలను జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ అసిత్ సాహా, అధికారుల బృందం ప్రారంభించారు. షాట్ పుట్, పరుగు పందెం తదితర క్రీడల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు రోలింగ్ ట్రోఫీలు, ప్రోత్సాహక బహుమతుల్ని అందించారు. పారాలింపియన్ రొంగలి రవి క్రీడా ప్రతిభను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జీఎస్ఐ అధికారులు ఎన్.ఎం.షరీఫ్, సుజిత్‌కుమార్ త్రిపాఠి పాల్గొన్నారు.



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

కుటుంబసభ్యుల చెంతకు అక్కాచెల్లెళ్లు

సీతంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే కొత్త కాలనీ వద్ద ఈనెల 19న తప్పిపోయిన ఎ.విజయలక్ష్మి (55), సుధాపుష్ప కుమారి (66)లను నాలుగో పట్టణ సీఐ విజయకుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి పట్టుకున్నారు. వారి సోదరుడు నాగేశ్వరరావుకు అప్పగించారు. మరో కేసులో నెల్లూరుకి చెందిన మానసిక వికలాంగురాలు హర్షిత ఆచూకీ కనిపెట్టి కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. సీపీ శంఖబ్రత బాగ్చి సిబ్బందిని అభినందించారు.

ఏడుగురు నిరాశ్రయులకు ఆశ్రయం

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దిక్కుతోచని స్థితిలో ఉన్న ఏడుగురు వృద్ధులను ఏయూటీడీ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించినట్టు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజన్, గోపాలపట్నానికి చెందిన అరటిపట్ల చిన్నారావు, మధ్యప్రదేశ్‌కు చెందిన సుబాలాల్, ఎల్.కోటకు చెందిన చల్లం నాయుడు, విజయవాడకు చెందిన యలమంచిలి శ్రీనివాసరావు, కొత్తవలసకు చెందిన స్వారంపూడి వసుంధర, విజయవాడకు చెందిన తాటి రాణిలకు వసతిగృహాల్లో ఆశ్రయం కల్పించామన్నారు.

గౌరీ పరమేశ్వరులకు సారె సమర్పణ

అక్కయ్యపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా జగ్గారావు బ్రిడ్జి సమీపంలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా రామకృష్ణానగర్ కాళ్ల వారి తోట గౌరీ సేవా సంఘం సభ్యులు శుక్రవారం సారె సమర్పించారు. రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి శంకువాని పాలెం, ఎన్టీ కాలేజీ, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, మహారాణి పార్లర్ మీదుగా సారెను భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, సంఘం అధ్యక్షుడు కాళ్ల సూర్యప్రకాశ్, బొడ్డేటి రవికుమార్, కొణతాల గోవింద్, కిరణ్, నాగేశ్వరరావు, వెంకటరావు, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మాధవధార: స్థానిక మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సింహాచల దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో అర్చకులు శ్రీనివాసశర్మ, పండితులు వేడుకలు జరిపారు. కళావేదికపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి జరిపిన కల్యాణ క్రతువులో కార్పొరేటరు రెయ్యి వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

సందడిగా కార్తీక దీపోత్సవం

సీతమ్మధార: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవంలో భాగంగా శ్రీకృష్ణ మందిరం వద్ద దీపోత్సవం నిర్వహించారు. తులసి దేవికి, వెంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

వేడుక చేసుకోవాలంటే వేదన తప్పదు

నగర నడిబొడ్డున కమ్యూనిటీ హాల్ కరువు

డాబాగార్డెన్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్ ప్రాంతమంటే తెలియనివారుండరు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతానికి ఇంతవరకు కనీసం కమ్యూనిటీ హాల్ నిర్మించలేదు. దీంతో ప్రజలకు అసౌకర్యంగా ఉంది. వివిధ వర్గాల ప్రజలు సామాజిక కార్యక్రమాలు, పెళ్లిళ్లు.. ఇతరత్రా వేడుకలు జరుపుకొనేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఎమ్మెల్యేలు ఇక్కడ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. వార్డులో సగానికిపైగా వాణిజ్య ప్రాంతం కావడంతో దశాబ్దాలుగా నివసిస్తున్న స్థానికులు ఏదైనా కార్యక్రమం తలపెడితే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. వార్డులో అవసరాలు గుర్తించి తక్షణమే వాటిని ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లపైనే చిన్న చిన్న షామియానాలు వేసుకుని దిగువ మధ్యతరగతి ప్రజలు, పేదలు కార్యక్రమాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రోడ్డుగుండా నిత్యం జిల్లా ఉన్నతాధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధులు వెళ్తున్నా స్థానికుల అవసరాలేమిటన్నది ఏనాడు విచారించలేదని ఆక్రోశిస్తున్నారు. ఇకనైనా స్పందించాలని కోరుతున్నారు.



డాబాగార్డెన్స్ జంక్షన్ ప్రాంతం

కమ్యూనిటీ హాల్ తక్షణావసరం

వార్డులోని కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి. దీనివల్ల అన్ని వర్గాలవారికి సౌకర్యంగా ఉంటుంది. చిన్న చిన్న కార్యక్రమాలు, ఇతరత్రా సమావేశాలు నిర్వహించడానికి ఇబ్బందికరంగా ఉంటోంది. కమ్యూనిటీ కల్యాణ మండపం వంటివి నిర్మిస్తే వార్డు ప్రజలు అన్ని కార్యక్రమాలు ఇక్కడే చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది.

- వై.సూరీడు, రిటైర్డ్ ఉద్యోగి

రోడ్డున పడుతున్నాం

ఇంటి నుంచి కొంచెం దూరంలోనే ముఖ్య రహదారి వచ్చేస్తోంది. దీంతో ఏ కార్యక్రమం, సమావేశాలు జరుపుకొనే వీలు లేకుండా ఉంటుంది. ఏ అవసరం తీర్చుకోవాలన్నా రోడ్డున పడుతున్నాం. వార్డు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. అధికారులు ఈ సమస్యను ప్రాధాన్య అవసరంగా గుర్తించాలి.

-ఎ.రేవతి, రంగాస్ట్రీట్

కిశోర్ బాలికల వికాసంపై శ్రద్ధ చూపాలి

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) కిశోర్ బాలికల ఆరోగ్యం, చదువుపై అధికారులు శ్రద్ధ వహించాలని, వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర్ వికాసంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడుతూ బాలికలకు రక్షణ కల్పించాలని, క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం, వైద్యపరమైన సేవలు అందించాలని ఆదేశించారు. అందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్ళేలా తర్ఫీదు ఇవ్వాలని వారిలో ఆత్మవిశ్వాసం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ జయాదేవి, ఎంఆర్ఎల్ రాధ, మల్లేశ్వరి, జానకి, డాక్టర్ సమత జీవన రాణి పాల్గొన్నారు.

సిరివినాయక తిరువీధి మహోత్సవాలు

అల్లిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం నేరేళ్లకోనేరు వీధిలోని శ్రీ సిరి వినాయక ఆలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అభివృద్ధి సంఘం శుక్రవారం తిరువీధి మహోత్సవాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఈనెల 25 వరకు కొనసాగుతాయన్నారు.అదే రోజు స్వామివారి ఆలయం వద్ద మహాఅన్నసమారాధన కార్యక్రమం ఉంటుదన్నారు .కమిటీ అధ్యక్షుడు రమేష్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గీతంలో ప్రత్యేక దంత వైద్య కేంద్రం

సాగర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు అతి తక్కువ ఖర్చుతో అధునాతన పరికరాలతో దంత వైద్యం చేయనున్నట్టు జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ గీతాంజలి తెలిపారు. శుక్రవారం ఆమె ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ ప్రత్యేక కేంద్రంలో దంత వైద్యంతో పాటు పొగాకు తదితర ఉత్పత్తుల వాడకం ద్వారా ఎదురయ్యే నోటి ఆరోగ్య సమస్యలకు సంబంధించి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు.

కేజీహెచ్‌లో పిల్లల శస్త్రచికిత్స గది ప్రారంభం

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో ఆధునిక సాంకేతిక విధానాలతో నిర్మించిన పిల్లల శస్త్రచికిత్స గది (పిడియాట్రిక్ సర్జరీ కాంప్లెక్స్)ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు శుక్రవారం ప్రారంభించారు, ఆంధ్ర వైద్య కళాశాల పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో అడ్వాన్స్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను వీరు ప్రారంభించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సరికొత్త లాప్రోస్కోపిక్ పరికరం తీసుకొచ్చారు. ఇది శస్త్ర చికిత్స ఖచ్చితత్వాన్ని మెరుగుపరుస్తుంది. రోగులు కోలుకునే సమయాన్ని తగ్గిస్తుంది. మెరుగైన ఆరోగ్య ఫలితాలనిస్తుంది. తద్వారా నిరుపేద పిల్లలకు ప్రయోజనం చేకూరుతుంది. పిల్లల శస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ గిరీష్ దీక్షిత్, జోసెఫ్ కిరణ్, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గదిని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిబాబు



న్యాయవాదుల నిరసన

నగరంలో న్యాయ కళాశాల విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కోర్టు గేటు వద్ద న్యాయవాదులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు కఠిన తీసుకోవాలని కోరారు.

- డాబాగార్డెన్స్, ఆంధ్రజ్యోతి

సంక్షేమ హాస్టళ్ల ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

బాధ్యత ఉంది. నగర పోలీస్ కమిషనర్‌కు బాలికల వసతి గృహాలకు సంబంధించిన జాబితాను అధికారులు అందించారు. రాత్రివేళల్లో ఆయా పరిసరాల్లో పెట్రోలింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. మెనూ అమలును ఉన్నతాధికారులను పర్యవేక్షించాలి.

మెరుగైన ఫలితాలు

హాస్టళ్లలో ఉండే విద్యార్థుల చదువుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. మెరుగైన ఫలితాలను సాధించేలా ఉన్నతాధికారులు లక్ష్యాలు విధించారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షల ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. ఇంటర్, డిగ్రీ, ఇతర కోర్సులు చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యాన్ని ప్రణాళికలో చేర్చారు. ఇందుకోసం ట్యూటర్స్‌ను నియమించుకోవాలి. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించాలి. గ్రేడ్లు కేటాయించాలి. క్విజ్ పోటీలు నిర్వహించాలి. మోటివేషనల్ క్లాసులను నిర్వహించాలి. వార్డెన్స్ స్కూల్ టీచర్లతో మాట్లాడి విద్యార్థులను చదువులో మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలను సిద్ధంచేయాలి. ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి. అడ్మిషన్లు పూర్తిగా అయ్యేలా చూడడం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించి చదువులో రాణించేలా చూడడం, క్రీడా పోటీలు నిర్వహించాలి.

యాక్షన్ ప్లాన్ అమలుకు స్పష్టమైన ఆదేశాలు

గత నెలాఖరు నుంచి వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా షెడ్యూల్‌ను తయారుచేశాం. ఇప్పటికే హాస్టల్ వార్డెన్స్‌కు షెడ్యూల్‌ను అందించి అమలుకు ఆదేశించాం. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంతోపాటు చదువులో రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. మెనూ అమలు, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అంశాలపై దృష్టిసారించాం. ట్యూటర్ల నియామకం, మోటివేషనల్ క్లాస్‌ల నిర్వహణకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నాం.

- కె.రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

శభాష్ నితీష్

... 5వ పేజీ తరువాయి

ఒక సిక్సర్‌తో 41 పరుగులు చేసి..చివరి వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకు ఆలౌట్ కాగా అందులో నితీష్‌కుమార్‌రెడ్డి చేసిన 41 పరుగులే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ ఏడాది జరిగిన ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన నితీష్‌కుమార్‌రెడ్డి... సెలక్టర్లను ఆకట్టుకున్నాడు. దీంతో స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. ఢిల్లీలో జరిగిన టీ20 మ్యాచ్‌లో భారీ హాఫ్ సెంచరీతో (74; 4 బౌండరీలు, 7 సిక్సర్లు) సత్తా నిరూపించుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించి భారత్ జట్టులో చోటు దక్కించుకోవడమే కాకుండా తొలి టెస్టులోనే తన ప్రతిభను నిరూపించుకున్నాడు.

సింహాచలం భూ సమస్య పరిష్కరించండి

... 5వ పేజీ తరువాయి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామనే విశ్వాసంతోనే ప్రజలు భారీ మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. దేవదాయ శాఖ అధికారులు అంశం కోర్టు పరిధిలో ఉందని అస్పష్టమైన సమాధానం చెప్పి తప్పించుకోవడం సరికాదన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ఇళ్లు కోల్పోయిన బాధితులు వారి కట్టడాల వెనుక ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలను కలుపుకొని నిర్మాణం చేపట్టుకోవడానికి దేవస్థానం, జీవీఎంసీల నుంచి అభ్యంతరం లేకుండా చూడాలని కోరారు. దేవస్థానం క్రమబద్ధీకరించబోయే 12,419 కట్టడాలకు ప్రత్యామ్నాయంగా ఇవ్వబోయే ప్రభుత్వ భూముల బదలాయింపు త్వరగా పూర్తిచేయాలని గంటా కోరారు.

సమాన విలువైన భూములే ఇస్తున్నారు

ప్రజలు గృహాలు నిర్మించుకున్న దేవస్థానం భూముల విలువ లెక్కించి ఆ విలువకు సమానమైన భూములు (రూ.5,377 కోట్లు) ప్రత్యామ్నాయంగా ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఈ ప్రక్రియ వేగవంతంగా జరగడం లేదన్నారు. టీడీపీ 2014లో గెలిచినప్పుడు విశాఖలో నిర్వహించిన తొలి మంత్రివర్గ సమావేశంలోనే దీనిపై తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, త్వరగా భూముల బదలాయింపు పూర్తిచేసి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

- వెలగపూడి రామకృష్ణబాబు, తూర్పు ఎమ్మెల్యే

ధర్మకర్తలతో మాట్లాడతాం: దేవదాయ శాఖా మంత్రి ఆనం

ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలపై దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. రూ.5,377 కోట్ల విలువైన భూములు దేవస్థానానికి ఇస్తున్నట్టు హైకోర్టుకు తెలియజేసి, 12,419 కట్టడాలను క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ఈ పంచ గ్రామాల సమస్యపై విశాఖలో ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. ఖాళీ స్థలాలకు గతంలోనే ధరలు నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలతోనే మాట్లాడతామని హామీ ఇచ్చారు.

కల్తీపై కొరడా

... 5వ పేజీ తరువాయి

వెలువరించారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, శుక్రవారం విచారణ పూర్తికావడంతో అడిషినల్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్ జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు తెలిపారు. కల్తీ చేస్తున్నట్టు అనుమానం ఉంటే పిర్యాదు చేయాలని కోరారు. కల్తీ చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, లైసెన్సులు కూడా రద్దుచేస్తామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

విశాఖ-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-2 ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.చిన్నారావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ చంద్రశేఖరవర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. విచారణ పూర్తయ్యే వరకు విశాఖపట్నం వదిలి వెళ్లకూడదని ఆదేశించారు. చిన్నారావు ప్రస్తుతం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు ఆయన సస్పెండ్ కావడంతో ఆ బాధ్యతలను విశాఖపట్నం-1 ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు అప్పగించారు. ఇప్పటికే తగిన వనరులు లేక అన్ని పరిశ్రమలను సకాలంలో తనిఖీ చేయలేకపోతున్నామని అధికారులు వాపోతున్నారు. ఈ సమయంలో ఏకంగా రెండు జిల్లాల బాధ్యతలను ఇంకో అధికారికి అప్పగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. అనకాపల్లి జిల్లాలో అత్యధిక సంఖ్యలో పరిశ్రమలున్నాయి. అక్కడే నిత్యం ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ఒక్కరిపైనే భారం మోపకుండా మరో అధికారిని నియమించాల్సిన అవసరం ఉంది. సకాలంలో తనిఖీలు నిర్వహించకపోతే ప్రమాదాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ఇదిలావుండగా పి.చిన్నారావు సస్పెన్షన్‌కు కారణాలేమిటో సంబంధిత శాఖ అధికారులు వెల్లడించడం లేదు.

పని ప్రదేశాల్లో నిబంధనలు పాటించాలి: ఏసీపీ



కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

సీతంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికులంతా తమ పనిలో జాగ్రత్తలు, నిబంధనలు, అధికారుల సూచనలను పాటించాలని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. పోర్టు ఆసుపత్రి సమీపంలో ఇన్‌ఆర్బిటల్ మాల్ నిర్మాణ కార్మికులతో నాలుగో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. మద్యం తాగి పనులు చేయకూడదని, పై అంతస్తులలో పనిచేసేవారు సేఫ్టీ హెల్మెట్‌ను ధరించాలని, బెల్టులు పెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా, ఎవరైనా నేరాలకు పాల్పడినా నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మొబైల్ నంబరు 7995095799కు ఫోను చేసి సమాచారం అందిస్తే వెంటనే పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా మానటరింగ్ కమిటీ సభ్యుడిగా ఆంజనేయ



ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా ఉక్కు ఉద్యోగి గనిరెడ్డి ఆంజనేయ నియమితులయ్యారు. సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ రామారావు శుక్రవారం ఆంజనేయకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నందుకు కమిటీలో స్థానం కల్పించారని, తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన

పెదగంట్యాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 76వ వార్డు పరిధిలో రూ.2.55 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేయనున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని అల్లూరి సీతారామరాజు పార్కుకు రూ. 2కోట్లతో వాటర్ లైన్లు, రామచంద్రానగర్‌లో రూ.40 లక్షలతో ప్రధాన రహదారి ఆధునీకరణ, రూ.15 లక్షలతో ఎస్సీ కాలనీలో ఇంటర్నల్ రోడ్ల ఏర్పాటుకు పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేయనున్నట్టు జీవీఎంసీ టీడీపీ డెప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు తెలిపారు.

మాజీ మంత్రి గురునాథరావుకు నివాళి



గురునాథరావు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు వర్ధంతి కార్యక్రమాన్ని గుడివాడ అప్పన్న ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం మిందిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాథరావు విగ్రహానికి ఆయన కుమారుడు, మాజీ మంత్రి అమర్‌నాథ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. గురునాథరావు అందించిన సేవలను కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఆయన పాత్ర అమోఘమన్నారు. అక్కిరెడ్డిపాలెం, మింది, అప్పన్నకాలనీ ప్రజలు వినియోగించుకునేందుకు ట్రస్టు ద్వారా మూడు ఫ్రీజర్ బాక్సులను అమర్‌నాథ్ ఆయా కాలనీల నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, ట్రస్టు ప్రతినిధులు గుడివాడ లతీశ్, అప్పలరామ్మూర్తి పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీభాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 36, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 34, క్యారెట్ 70 దొండకాయలు 34, బంగాళదుంపలు 40, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 80, అల్లం 50, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో)65, గోరుచిక్కుడు 34, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 46, కీరదోస 26, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32,కంద 66, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ఏం 'సంత'రా బాబూ!

- వార్డుల్లో రోడ్లపైనే వారపు సంతలు
- తీరని ట్రాఫిక్ సమస్యలు
- ప్రత్యామ్నాయంపై దృష్టిసారించని అధికారులు



డ్రైవర్స్ కాలనీ రోడ్డులో సంత నిర్వహిస్తుండడంతో నిలిచిపోయిన వాహనాలు

గాజువాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :గాజువాక నియోజకవర్గంలోని అధిక శాతం వార్డుల్లో వారపు సంతలు నిర్వహిస్తున్నారు. వారంలో ఒక్కో రోజు ఒక్కో చోట ఈ సంతలు జరుగుతుంటాయి. ఈ సంతలన్నీ కాలనీల మధ్య రోడ్లపై నిర్వహిస్తుండడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ఈ రోడ్లు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. అయితే సంత నిర్వహించడం వల్ల కాలనీల ప్రజలకు ఉపయోగమే అయినప్పటికీ చిన్న రోడ్లు కావడంతో రోడ్డు మొత్తం రకరకాల దుకాణాలతో నిండిపోతుంటాయి. దీంతో మార్కెట్టుకు వచ్చే వారు తిరగడానికి కూడా ఇబ్బందిగా ఉంటోంది. దీనికితోడు ఈ మార్గంలో వెళ్లే వారు తప్పనిసరిగా ఇటువైపు నుంచే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో సంత నిర్వహించే రోజుల్లో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. రోడ్డుపై నిలిచిన వారిని తప్పుకోవాల్సిందిగా వాహనదారులు హారన్ల మోత మోగించడంతో శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. మరోవైపు సంతకు వచ్చే వారు, వాహనదారుల మధ్య తరచూ వివాదం నెలకొంటోంది. ఎవరి బిజీలో వారు ఉండడంతో దుకాణాల వద్ద ఉంటే కొనుగోలుదారులను తప్పుకోమన్నా, వాహనదారులను కాస్త ఆగమన్నా ఎవరూ వినే పరిస్థితిలో ఉండరు. కొన్నిసార్లు అసహనం ఎక్కువై వాగ్వాదాలు జరుగుతుంటాయి.

అయితే గాజువాక ప్రాంతంలో సంతల నిర్వహణ పూర్వకాలం నుంచి వస్తుండడంతో వీటిని నిలిపి వేసేందుకు ఎవరూ ఇష్టపడరు. సాహసించరు.

ప్రతి వార్డుల్లో స్థలం కేటాయించాలి

వార్డుల్లో రోడ్లపై వారపు సంతలను రోడ్లపై నిర్వహిస్తుండడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారుతుండడంతో మార్కెట్టు కోసం స్థలాలను కేటాయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్థలాలు కేటాయించి షాపులు నిర్మించడం వల్ల వార్డు ప్రజలకు శాశ్వతంగా మార్కెట్టు అందుబాటులో ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్లాంటు పరిరక్షణ కోరుతూ ర్యాలీ, బహిరంగ సభ రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణ డిమాండ్ చేస్తూ ఈ నెల 24న గాజువాకలో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ప్లాంట్‌లో అఖిలపక్ష నాయకులు ఆవిష్కరించి మాట్లాడుతూ ప్లాంట్‌లో పరిస్థితి రోజురోజుకూ దిగజారుగతోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఇంత జరుగుతున్న ప్రజా ప్రతినిధులు స్పందించటం లేదని ఆరోపించారు. ప్రధానమంత్రి ఈ నెల 29న విశాఖ రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించమని, సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, నాగరాజు, వంశీకృష్ణ, ఉరుకూటి అప్పారావు, గురునాథ్, వరహాలు, వేణు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

- సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం



మాట్లాడుతున్న అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వేతనాల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం తగదని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం వద్ద నగదు నిల్వలు ఉన్నప్పటికీ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ శేషాద్రి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటి నివారణకు బాధ్యతగా కృషిచేయాలని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గాజువాక మలేరియా నిర్మూలనా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అక్కిరెడ్డిపాలెం హైస్కూలు వద్ద విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ మలేరియా వంటి వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స కంటే వాటిని రాకుండా నిర్మూలించడమే ఉత్తమమన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం, ఎల్వీ లక్ష్మి, ఎస్.అనంతలక్ష్మి, డి.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కొత్తర అప్పలరాజు పాల్గొన్నారు.

గండి బాబ్జీకి కార్పొరేటర్ రౌతు అభినందనలు



గండి బాబ్జీని అభినందిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, తదితరులు

అగనంపూడి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆయిల్, సీడ్స్ కో-ఆపరేటివ్ సంస్థ చైర్మన్‌గా శుక్రవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన గండి బాబ్జీని గ్రేటర్ విశాఖ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి అభినందనలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం, మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కరణం అప్పారావు, యర్రా అప్పలరాజు తదితరులు ఉన్నారు.

71, 85 వార్డుల్లో బోరువెల్స్ ప్రారంభం

ఆటోనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 71వ వార్డు ఆటోనగర్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ రాజానరామారావు రెండు బోరు వెల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన ప్రాధాన్యమన్నారు. స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కాలనీవాసులు అన్నెంరెడ్డి అన్నపూర్ణ, పప్పు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

85వ వార్డులో..

అగనంపూడి (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు మంత్రిపాలెంలో జీవీఎంసీ నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శుక్రవారం కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో నీట ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూటమి స్థానిక నేతలు జెర్రిపోతుల అప్పారావు, రాజు, గంగరాజు, మడక నూకరాజు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

ప్రభుత్వ విప్ గణబాబుకు ఘన స్వాగతం

గోపాలపట్నం,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా విశాఖ వచ్చిన పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబుకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుంచి గురువారం రాత్రి విశాఖ చేరుకున్న గణబాబుకు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి చేరుకుని స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో గోపాలపట్నంలోని తన నివాసానికి బయలుదేరిన గణబాబుకు దారి పొడువుగా అభిమానులు పూలమాలలు వేసి నీరాజనాలు పలికారు.పలువురు గజమాలలతో సత్కరించారు. గోపాలపట్నంలోని నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన నివాసానికి వెళ్లారు.

'కార్మికులకు నాణ్యమైన భోజనం లేదు'

మల్కాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో పని చేస్తున్న కార్మికులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని విశాఖపట్నం కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణమూర్తి (నాని) ఆరోపించారు. శుక్రవారం కోరమాండల్ గేటు వద్ద కాంట్రాక్టు కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులతో యాజమాన్యం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని, సీనియర్లకు ఒకలా, జూనియర్లకు ఒకలా ఇస్తున్నారని చెప్పారు. కార్మికులందరికీ సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కంపెనీలో ఇద్దరు కార్మికులకు ప్రమాదం జరిగి గాయపడితే వారికి ఈఎస్ఐ ద్వారా వైద్యం అందలేదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సత్యనారాయణ, గుడాల రాంబాబు, కె. శంకరరావు, శేఖర్, ప్రకాశ్, మండల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్



కాంప్లెక్స్ చుట్టూ పెరిగిన తుప్పలు

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు నిర్వహణ కరువు

- ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారులు
- పాడవుతున్న క్రీడా సామగ్రి
- కాంప్లెక్స్ చుట్టూ పెరిగిన తుప్పలు
- చీకటి పడితే మందుబాబుల ఆగడాలు

గోపాలపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని క్రీడాకారుల కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రూ. 3.50 కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నెలలు తరబడి నిర్వహణకు నోచుకోవడం లేదు. గ్రామీణ యువతను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు. గత ప్రభుత్వం దీన్ని పే అండ్ ప్లే ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. ప్రైవేటు వ్యక్తులు కూడా నిర్వహణను గాలికి వదిలేయడంతో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది.గోపాలపట్నంలో ఏడేళ్ల క్రితం ఈ కాంప్లెక్స్ నిర్మించారు. చుట్టూ రెండు ఎకరాల సువిశాల మైదానం, మైదానంలో ఓపెన్ జిమ్, క్రీడాకారులు సేదతీరడానికి గ్యాలరీలు ఇలా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ వల్ల క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని భావించినా ఫలితం మాత్రం శూన్యం. కాంప్లెక్స్ నిర్మాణం జరిగిన తరువాత వీఎంఆర్‌డీఏ అధీనంలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను గత ప్రభుత్వం సాయ్‌కు అప్పగించింది. సాయ్ ఆధ్వర్యంలో పెద్దగా క్రీడా కార్యక్రమాలు జరగకపోవడంతో కొన్నేళ్ల పాటు కొందరు స్థానిక వ్యక్తులే నిర్వహణ చేపట్టారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు పే అండ్ ప్లే ప్రాతిపదికన 2021లో సాయ్ అప్పగించింది. అప్పటి నుంచి ప్రైవేటు వ్యక్తులే దీన్ని నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ తీసుకున్న వారు ఆదాయం రావడం లేదని కొన్ని నెలలు క్రితం విడిచిపెట్టినట్టు తెలిసింది. దీంతో నిర్వహణ లేక స్పోర్ట్స్ కాంప్లెక్స్ దుర్భరంగా మారుతోంది. కాంప్లెక్స్ చుట్టూ పొదలు పెరిగిపోయాయి. లోపలికి వెళ్లే గేట్లు తుప్పు పట్టి పుట్టలు, కందిరీగ పట్టులు పట్టాయి. చీకటి పడితే కాంప్లెక్స్ ఆవరణలో మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు అడ్డాగా మార్చుకుంటున్నారు. కాంప్లెక్స్ నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోకపోతే లోపలి భాగంలో ఉన్న రూ.లక్షలు విలువ చేసే ఉడెన్ ఫ్లోరింగ్ చెదలు పట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సక్రమంగా నిర్వహించి స్థానిక క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌పై ఉన్న బడ్డీని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మల్కాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ఆర్‌టీసీ డిపో సమీపంలో ఉన్న కొత్తనక్కవానిపాలెం పాత చెక్కు పోస్టు ఏరియాలో ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణల తొలగింపు శుక్రవారం కూడా కొనసాగింది. పాత వైసీపీ కార్యాలయం వద్ద విద్యుత్ లైట్ల కోసం రోడ్డు మీద వేసిన పైపును తొలగించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ సిబ్బందికి చెప్పడంతో వారు తొలగింపునకు సిద్ధమవుతుండగా 61వ వార్డు నాయకుడు మూగి సూర్యనారాయణ అడ్డుకున్నారు. ఓ ఫంక్షన్ నిమిత్తం పైప్ వేశారని, ఫంక్షన్ ముగిసిన వెంటనే తొలగిస్తారని పోలీసులకు చెప్పారు. ఫుట్‌పాత్ మీద నేరుగా ఓ ప్రైవేటు బ్యాంక్‌కు చెందిన ఏటీఎం ఉందని, దాన్ని ముందు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా జోన్ 5 పరిధి జింక్ గేటు నుంచి సింధియా వరకు ఉండగా, ప్రస్తుతం జింక్ గేటు నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు మాత్రమే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్నారు. గాజువాక పరిధిలో ఎటువంటి తొలగింపులు చేపట్టడం లేదు. దీనిపై ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కుపై కూటమి మోసపూరిత ప్రకటనలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజం

జగదాంబ కూడలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. శుక్రవారం సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈనెల 29న విశాఖలో పర్యటించనున్న ప్రధాని నరేంద్ర మోదీ తో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై అసెంబ్లీ, శాసనమండలిలో చర్చ జరిగిందని, ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయడానికి ప్రభుత్వం నిరాకరించడం కూటమి వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. గతంలో కేంద్రమంత్రి కుమారస్వామి చేసిన ప్రకటనను కూటమి నేతలు వల్లెవేయడం ఏమిటని ప్రశ్నించారు. గాజువాక అసెంబ్లీ సీటులో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గెలిపిస్తే విశాఖ ఉక్కు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆక్షేపించారు. ఆదానీ కుంభకోణం ప్రపంచాన్నే విస్తుపోయేలా చేసిందని, ఆదానికి అరెస్ట్ వారెంట్ జారీ చేసే దమ్ముందా? అంటూ కేంద్రంలోని పెద్దలను శ్రీనివాసరావు నిలదీశారు. ఈ సమావేశంలో సిటు నాయకులు జగ్గునాయుడు, కె.లోకనాథం పాల్గొన్నారు.

'నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి'

పెదగంట్యాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత నిరుద్యోగులకు కర్మాగారం లేదా దాని అనుబంధ సంస్థల్లో ఉపాధి కల్పించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (ఇంటక్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కురందాసు వంశీకృష్ణ యాదవ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని, స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగాన్ని కోరారు.ఈమేరకు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూములు త్యాగం చేసి మూడో తరం వచ్చినా ఇంకా 8 వేల మంది నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో పడిన కారణంగా కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈనెల 29న విశాఖ రానున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి నిర్వాసిత నిరుద్యోగుల సమస్య తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

సాయి హెల్పింగ్ హ్యాండ్స్‌కు రూ. లక్ష విరాళం

పెందుర్తి,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమాజ హితమే ధ్యేయంగా విస్తృత సేవలు అందిస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు బాలాజీ ట్రాన్స్‌పోర్టు అధినేత తిమ్మా నారాయణ తేజ రూ. లక్ష విరాళం అందజేశారు.ఈ మొత్తాన్ని ఆయన ట్రస్టు కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనుకు ఇచ్చారు. ఈ నగదుతో అనాధ మృతదేహాల అంతిమ యాత్రకు వాహనం కొనుగోలు చేయనున్నట్టు సభ్యులు తెలిపారు.

జాబ్ మేళాలో ఎనిమిది మంది ఎంపిక

పెందుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎనిమిది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ టి, థియోఫిలస్ తెలిపారు. అచ్యుతాపురంలోని సెజ్‌లో ఉన్న యోకహోమా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిగ్రీ, పిజి పూర్తి చేసిన ఎనిమిది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్ ఫ్లోరా అభినందించారు.

సత్యసాయి మార్గం.. ఆదర్శప్రాయం

- పలుచోట్ల ఘనంగా జయంత్యుత్సవాలు



అంధులకు ఆహార సామగ్రి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

పెదగంట్యాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయిబాబా సమాజానికి ఎంతో విలువైన సేవలు అందించారని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి పేర్కొన్నారు. సత్యసాయిబాబా జయంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలువురు వృద్ధులు, అంధులు, రోగులు, జీవీఎంసీ సిబ్బందికి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో పలు సామగ్రితో పాటు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తిమార్గాన్ని ప్రబోధించడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజానికి సాయిబాబా ఆదర్శప్రాయులు అయ్యారన్నారు. ఆధ్యాత్మిక సేవ నిర్వాహకులు గల్లా శంకర్‌సాయిరాం మాట్లాడుతూ సత్యసాయి సమితి ద్వారా విశేష సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు గొందేశి ఎరుకునాయుడు, ఎలమంచిలి అప్పలనాయుడు, ప్రకాష్, గొందేశి గురప్పరెడ్డి, బంగారురాజు, ముసలయ్య, గురునాథరెడ్డి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమితి ఆధ్వర్యంలో....

స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుతాపురంలోని దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వి.రామారావు, రామచంద్రరావు, కృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

86వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు సేకరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

కూర్మన్నపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పకీరుతఖ్యా, ఉడానగర్‌లో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ కార్యకర్తల కోసం ఆలోచించే పార్టీ టీడీపీ మాత్రమే అన్నారు. అందుకే వారి సంక్షేమానికి సభ్యత్వం తీసుకుంటే బీమా సదుపాయం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు వేగుంట శ్రీనివాస్, రమేష్, చిన్ని, మూసా, గఫూర్ పాల్గొన్నారు.

డెయిరీ కార్మికుల దీక్షలకు సీఐటీయూ మద్దతు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలు సమస్యల పరిష్కారం కోరుతూ విశాఖ డెయిరీ కార్మికులు డెయిరీ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం గాజువాక సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యం ఇకనైనా నియంత పోకడలను వీడి కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ దీక్షల్లో ఎ.లోకేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఏడీ సాకేతపురం క్వార్టర్స్‌లో ఉన్న ఎన్ఏడీ కార్యాలయం ఎదుట ఎన్ఏడీసీఈ యూనియన్ నాయకులు, కార్మికులపై సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ ఎన్‌డీఏ గేటు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీజీఎం వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. 30 ఏళ్లుగా వస్తున్న ఓటీని అమలు చేయాలని, కొత్త విధానం వద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత విశాఖపై అవగాహన

వేపగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట కూడలిలో శుక్రవారం దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై శానిటేషన్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్ఓ బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు ఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో శానటరీ సూపర్‌వైజర్ కేవీ రమణ, ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆసరా

సమాజ సేవే పరమావధి

ఆదర్శంగా సాయి హెల్పింగ్ హ్యాండ్స్

(పెందుర్తి, ఆంధ్రజ్యోతి)

జీవితంలో నిలదొక్కుకోలేదు. స్థితిమంతుడూ కాదు.. మందుల దుకాణం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. అయినా...అవసరంలో ఉన్న తోటి మనిషికి సాయం చేయాలనే ఆలోచన, తపన మార్గాన్ని చూపించింది. తనకున్న దాంట్లో కొంత పంచే గుణమున్నప్పటికీ, మరింత మంది దాతల సాయంతో ఎంతోమందిని ఆదుకోవచ్చుననే భావంతో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటుచేశాడు. తాను ముందుండి సమాజసేవే పరమావధిగా సంస్థను నడిపిస్తున్నాడు పెందుర్తి మండలం చింతల అగ్రహారానికి చెందిన దాడి శ్రీనివాస్.

ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అత్యవసర శస్త్రచికిత్సకు రక్తం అవసరమైంది. ఫోన్ రావడంతోనే యువకుడి గ్రూపు రక్తం కోసం చాలామందిని సంప్రదించాడు. అవసరమైన రక్తం సమకూరింది. యువకుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఇది శ్రీనివాస్‌ను బాగా కదిలించింది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోకుంటే మానవ జన్మకు సార్థకత లేదని భావించాడు. అంతే 'సాయి హెల్పింగ్ హ్యాండ్స్' పేరిట 2016లో సంస్థకు అంకురార్పణ చేశాడు. చింతల అగ్రహారానికి దాడి శ్రీనివాస్‌కు పెందుర్తిలో ఓ మెడికల్ స్టోర్స్ ఉంది. ఆ సంపాదనతోనే కుటుంబాన్ని పోషిస్తూ, పలువురికి సాయం చేస్తుండేవాడు. ఇది వ్యక్తిగతంగా సంతృప్తిని ఇస్తున్నప్పటికీ అంతకు మించి చేయాలనే తపన ఉంది. దీంతో ట్రస్ట్ ఏర్పాటుచేయడం ద్వారా విభిన్న రంగాలు, వృత్తుల్లో ఉన్న సేవాభావం గల యువతను సంప్రతించాడు. ఆసక్తి కలిగిన యువత చేతులు కలిపారు. ఇలా 15 మంది యువతీ, యువకులు సామాజిక సేవ చేస్తున్నారు.

సోషల్ మీడియా వేదికగా...

ఈ ట్రస్ట్‌లో ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఉద్యోగం, వ్యాపారం చేస్తున్న అనేక ప్రాంతాలకు చెందిన యువత భాగస్వాములయ్యారు. సామాజిక మాధ్యమాలను వినియోగించుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.టీఠీఠీ.ట్రజీఝ్బుజూఇజీఃఋఝ్బుచీటౌటజజీ, సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఫేస్‌బుక్ ఖాతాతో పేజీని రూపొందించారు. కార్యక్రమాల నిర్వహణకు నిధులు ఆశించకుండా తమ సొంత డబ్బునే వినియోగిస్తుండడం ఈ సంస్థ విశేషం.

విద్య, ఆరోగ్యం వంటి సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి, సేవకు ఉపక్రమిస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి, సాయం అవసరమైన వారిని గుర్తిస్తారు. ఈ క్రమంలో రక్తదానం, వైద్య శిబిరాల నిర్వహణ, నిరుపేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వృద్ధులు, అభాగ్యులకు అన్నదానం, అనాథలు, మానసిక స్థితి సరిగా లేనివారిని పోలీసుల సహకారంతో ఆశ్రమాల్లో చేర్పించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

దయార్ద్రగోడకు విశేష స్పందన

ట్రస్ట్ సేవలు విస్తృతం చేయాలన్న సంకల్పంతో పెందుర్తి కూడలిలో దయార్ద్ర గోడను ఏర్పాటుచేశారు. ఇక్కడ మనకు అవసరం లేని పాత బట్టలు, సామగ్రి వదిలి వెళ్లవచ్చు. అవసరమైన వాటిని తీసుకోవచ్చు. ఈ గోడపై ఉన్న సెల్ నంబరును సంప్రతిస్తే ట్రస్ట్ సభ్యులు వచ్చి, ఇచ్చినవి తీసుకుని అవసరమైన వారికి అందిస్తారు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో మిగిలిపోయిన ఆహారాన్ని అప్పగిస్తే, అభాగ్యుల ఆకలి తీరుస్తారు. వీటితో పాటు స్వచ్ఛ భారత్, అవయవదానం, వ్యాధుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్‌కు ఇటీవల సావిత్రీబాయి పూలే అవార్డు దక్కింది.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

సేవలు విస్తరిస్తాం



సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు విస్తృతం చేసే ఆలోచనలో ఉన్నాం. ఇందుకు సాయం చేసే చేతుల కోసం చూస్తున్నాం. యువ చైతన్యం ద్వారా సోషల్ మీడియాలో సేవపై అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛందంగా సేవ చేయాలనే ఆలోచన ఉన్నవారెవరైనా ఇందులో చేరొచ్చు. ఈ క్రమంలో 1280 ఆదాయ పన్ను శాఖ నుంచి గుర్తింపు సాధించగలిగాం. సలహా, సహాయం కోసం 8639999343 నంబరులో సంప్రతించవచ్చు.

\- దాడి శ్రీనివాస్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు

సౌర విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

- ఎంపీ గొల్ల బాబూరావు
- ఏయూ మైదానంలో సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో ప్రారంభం



సోలార్ ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

మద్దిలపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో అమలుచేస్తున్న సోలార్ సంబంధిత పథకాల ద్వారా వినియోగదారులకు బహుళ ప్రయోజనాలున్నాయని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పేర్కొన్నారు. ఏయూ మైదానంలో సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పోను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌరవిద్యుత్ వల్ల ఆర్థిక భారం తగ్గడమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. విశాఖ వేదికగా ఎక్స్‌పో ఏర్పాటు శుభపరిణామమన్నారు.ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ద్వారా సాధారణ ప్రజలు, కుసుమ్ పథకం ద్వారా రైతులకు రాయితీ రుణాలు అందుతాయన్నారు. డిస్కమ్ పరిధిలో ప్రతి వినియోగదారుడికి సోలార్ విద్యుత్ ఇవ్వాలన్నదే లక్ష్యమన్నారు. 11 జిల్లాల పరిధిలో మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీరాజ్, డ్వాక్రా గ్రూప్ సభ్యులను భాగస్వామ్యం చేసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. తమ పరిధిలో పది లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 40 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించేలా ఏయూ మైదానంలో మూడు రోజులు ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు హేమకుమార్, ప్రధాన కార్యదర్శి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి జయబాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద ప్రణవ్‌గోపాల్



అప్పన్న ఆలయంలో క్రికెటర్లు

సింహాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో క్రికెటర్లు శుభమ్ దుబే, జితేష్ శర్మ, దీపేష్ పరవాని, పార్థరేఖడే, యాష్‌తోరట్, అక్షయ్ వాడ్కర్, మందర్ మహాలేతో పాటు వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఉన్నారు. ప్రముఖులందరికీ ఆలయ ప్రొటోకాల్ ఏఈఓ వెంపలి రాంబాబు, ఆలయ ఏఈఓ నక్క ఆనందకుమార్ సాదర స్వాగతం పలికారు. ఆలయంలో విశిష్ఠ కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. వీఎంఆర్‌డీఏ ఛైర్మన్‌కు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు చేసిన తరువాత ప్రముఖులకు ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

పట్టపగలు మహిళల చేతివాటం



నెక్‌సెట్స్ కొట్టేసిన మహిళలు

జగదాంబ కూడలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్ కుమ్మరవీధి లేపాక్షి ఏరియాలోని గోల్డ్‌కవరింగ్ షాపులోకి శుక్రవారం ఉదయం నలుగురు మహిళలు ప్రవేశించి ఖరీదైన నెక్ సెట్స్ బాక్సును చీర లోపల దాచేసి జారుకునేందుకుయత్నించారు. షాపు వెలుపల ఉన్న ఓ సెల్స్‌మన్ పసి గట్టడంతో విషయం బయటపడింది. అప్పటికే ఇద్దరు మహిళలు బాక్సులతో పారిపోయేందుకు ప్రయత్నించగా వ్యాపారులు వెంబడించి పట్టుకున్నారు. దొరికిపోయిన నలుగురూ అల్లిపురం ప్రాంతానికి చెందినవారని పోలీసులకు చెప్పారు. వారిని స్టేషన్‌కు తరలించారు. గతంలో వీరు షాపింగ్‌మాల్స్ నుంచి చీరలు దొంగతనం చేసి దొరికిపోయినట్టు మహారాణిపేట క్రైం పోలీసులు అనుమానిస్తున్నారు.

అత్యాచారం ఘటనలో నిందితుడిపై పోక్సో కేసు

మహారాణిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమ పేరుతో శారీరకంగా లొంగదీసుకుని అత్యాచారం జరిపిన రౌడీషీటర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన దేసరాజు దినేష్‌కుమార్ ఓ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో వంచించి విజయనగరం తీసుకెళ్లి అత్యాచారం జరిపాడన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదుతో విచారణ చేపట్టి నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

విశాఖపట్నం, స్పోర్ట్సు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లు శనివారం ప్రారంభం కానున్నాయి. పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం, విజయనగరంలోని పీవీజీ రాజు కాంప్లెక్సు వేదికలుగా అసోం, రైల్వేస్, విదర్భ, ఛండీగఢ్, పాండిచ్చేరి, ఛత్తీస్‌గఢ్, ఒడిశా జట్లు మ్యాచ్‌లు ఆడుతాయి. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం చండీగఢ్ -పాండిచ్చేరి, విదర్భ-ఒడిశా జట్లు తలపడతాయి. విజయనగరంలో అసోం-రైల్వేస్ మధ్య మ్యాచ్ జరగనుంది.

స్టాండింగ్ కమిటీ సమావేశం వాయిదా

వెంకోజీపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. సమావేశం అంశాలను సభ్యులకు రెండు రోజుల ముందు తెలియజేసినప్పటికీ, అప్పటికే విజయవాడలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు గండి బాబ్జీ, సీతారాం సుధాకర్‌ల ప్రమాణ స్వీకారోత్సవంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కొంతమంది పాల్గొనేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో సమావేశానికి సరిపడా సభ్యులు లేక వాయిదా పడిందని ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు.

కళాభిమానికి కన్నీటి వీడ్కోలు

- బాదంగీర్ సాయి మృతదేహం వద్ద అభిమానుల ఘన నివాళి



బాదంగీర్ సాయి అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబసభ్యులు, కళాభిమానులు (ఇన్‌సెట్లో) సాయి మృతదేహం

మాధవధార, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) ప్రముఖ నాటక రచయిత, రంగ సాయి నాటక సంఘం వ్యవస్థాపకులు ఏవీఎస్ మూర్తి (బాదంగీర్ సాయి) అంత్యక్రియలు శుక్రవారం అభిమానుల అశ్రునయనాల మధ్య జరిగాయి. మాధవధార గాయత్రి స్కూలు సమీపంలోని ఆయన నివాసం వద్దకు చేరుకున్న కళాభిమానులు, ప్రముఖులు ఘన నివాళులర్పించారు. సాయి పార్థివదేహాన్ని అభిమానులు, కుటుంబీకులు సందర్శించారు. నాటక రంగ ప్రియులు, కళాభిమానులు ఆయన సేవల్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అనారోగ్యం కారణంగా కన్నుమూయడం నాటక రంగానికి తీరనిలోటని కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. పాలకొల్లు నుంచి నగరానికి వచ్చిన ఆయన మరుగున పడిపోతున్న నాటక రంగానికి జీవం పోయడానికి విశేష కృషి చేశారన్నారు. లీడర్ రమణమూర్తి తదితరులు సంతాపం తెలిపారు. అనంతరం మాధవధార శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సాయి కుమారుడు వీరేశు, కుమార్తె నవ్య, భార్య హైమావతి, బంధువుల కన్నీటి నివాళి మధ్య అంతిమ యాత్ర సాగింది.

దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ శాంతి భర్తకు బదిలీ

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతి భర్త మానిపాటి మదన్‌మోహన్‌ను హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు బదిలీ చేశారు. ఆయన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శాంతికి ఇటీవల జన్మించిన మగబిడ్డ విషయమై ఇద్దరూ గొడవపడి విడాకుల వరకూ వెళ్లిన విషయం రెండు రాష్ట్రాల్లోను సంచలనమైన సంగతి తెలిసిందే. తొలుత వీరికి జన్మించిన ఇద్దరు కవల ఆడపిల్లలు మదన్‌మోహన్ వద్దే ఉంటున్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న మహిళా చేతన సభ్యులు

సిరిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లా కళాశాల విద్యార్థిని అత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ బాధితురాలితో చదువుకుంటున్న తోటి విద్యార్థులే అత్యాచారానికి పాల్పడడం దారుణమన్నారు. విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన కలవర పరిచిందన్నారు. ప్రేమ పేరుతో ఆడపిల్లలను ఉచ్చులోకి దింపి అఘాయిత్యాలకు పాల్పడి, మోసం చేసి పెళ్లికి మొహం చాటేయడం సర్వసాధారణమైపోయిందన్నారు. న్యాయ విద్యార్థి అత్యాచారం కేసులో నిందితులను త్వరితగతిన విచారించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచార కేసుల్లో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని అప్పుడే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీకేఎస్ అన్నపూర్ణ, హెచ్ఆర్ఎఫ్ అనురాధ, న్యాయవాది జహీరా, భారత నాస్తిక సమాజం సభ్యులు నూకరాజు, రాంప్రభు, మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులను కొనసాగించడంతో పాటు దువ్వాడ మీదుగా శ్రీకాకుళం రోడ్డు, కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-కొల్లాం-విశాఖ కొనసాగింపు

08539 నంబరు గల ప్రత్యేక రైలు డిసెంబరు నాలుగు నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20గంటలకు విశాఖలో బయ లుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 085 40 నంబరు గల రైలు డిసెంబరు ఐదు నుంచి ఫిబ్రవరి 27 వరకు ప్రతి గురువారం రాత్రి 7.35 గంటలకు కొల్లాంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

శ్రీకాకుళం-కొల్లాం- శ్రీకాకుళం ప్రత్యేక రైలు

08553 నంబరు గల ప్రత్యేక రైలు డిసెంబరు ఒకటి నుంచి జనవరి 26 వరకు ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి ఉదయం 8.47 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08554 నంబరు గల ప్రత్యేక రైలు డిసెంబరు రెండు నుంచి జనవరి 27 వరకు సోమవారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి మర్నాడు రాత్రి 11.35 గంటలకు దువ్వాడ, బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అక్షయ ప్రణీత్ ప్రతిభ



కొమ్మాది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థాయి కరాటే పోటీల్లో లక్ష్మీవానిపాలేనికి చెందిన పోతిన అక్షయ ప్రణీత్ ఢిల్లీలో ఇండియన్ ఆర్గనైజేషన్ శుక్రవారం నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో (11 ఏళ్ల విభాగం) మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ విద్యార్థిని పలువురు అభినందించారు.

త్వరలో ఆపరేటర్లకు ఫైబర్ నెట్ బాక్సులు

- ఏపీఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ జీవీ రెడ్డి



ఛైర్మన్‌ను కలిసిన అధికారులు

విశాఖపట్నం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపరేటర్లకు కొద్ది రోజుల్లోనే ఫైబర్‌నెట్ బాక్సులను అందిస్తామని ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఏపీఎస్ఎఫ్ఎల్ కార్యాలయానికి ఆయన శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్‌ను పరిశీలిం చారు. అనంతరం ఉద్యోగులతో చర్చించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలని కోరారు. త్వరలోనే బాక్సులను అందించడంతోపాటు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఫైబర్ నెట్‌వర్క్‌కు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

రాజీ కుదిరింది... కేసు కొట్టివేయండి

- విశాఖ కోర్టు కేసుపై హైకోర్టులో హోం మంత్రి అనిత పిటిషన్

అమరావతి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 'విశాఖ కోర్టులో చెక్ బౌన్స్ కేసు పెండింగ్‌లో ఉంది. దానిలో ఫిర్యాదిదారుడు వేగి శ్రీనివాసరావుకు, నాకు మధ్య రాజీ కుదిరింది. సంబంధిత కేసును కొట్టివేయాలి' అని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనిత హైకోర్టులో పిటిషన్ వేశారు. 'ఇరువైపుల పెద్దలు, శ్రేయోభిలాషులు వివాదాన్ని రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇరువురం రాజీపత్రాన్ని రాసుకున్నాం. ఆ పత్రాన్ని విశాఖ 7వ ప్రత్యేక మేజిస్ట్రేట్ ముందు ఉంచామన్నారు. ప్రస్తుత పిటిషన్‌కూ జత చేశాం.

ఈ నేపథ్యంలో విశాఖ కోర్టులోని సీసీ నంబరు (320/2019)ని కొట్టివేయాలి. హైకోర్టులో జరిగే విచారణకు నా తరఫున సందు జగదీశ్ సాయి అనే వ్యక్తి హాజరవుతారు. అవసరమైన పత్రాలపై సంతకం చేస్తారు. అందుకు వీలుగా పవర్ ఆఫ్ అటార్నీ ఇస్తూ నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపరును వ్యాజ్యంతో జత చేశా' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన వద్ద నుంచి తీసుకున్న రూ.70 లక్షల అప్పును చెల్లించేందుకు 2018లో అనిత చెక్కు ఇచ్చారని, అది చెల్లలేదని పేర్కొంటూ వేగి శ్రీనివాసరావు విశాఖపట్నం కోర్టులో 2019లో పిటిషన్ దాఖలు చేశారు.







